


జపాన్ ఓపెన్ సూపర్ 750లో అద్భుత విజయం సాధించిన పీవీ సింధుకి హృదయపూర్వక అభినందనలు. జపాన్ ఓపెన్ సూపర్ 750లో అకానె యమగుచిపై సింధు నిర్భయమైన ఆట ప్రదర్శించారు. భారతీయ ఛాంపియన్‌కు ఉండాల్సిన పట్టుదల, దృఢ సంకల్పం, అకుంఠిత స్ఫూర్తికి నిజమైన నిదర్శనం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 20.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 89 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఆకాశమే హద్దుగా భోగాపురం

## పోర్టులు, హైవేలు, పరిశ్రమలు, టూరిజానికి కొత్త ఊపు





అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారంగా మారుతుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కొత్త ఎయిర్ పోర్టు ఆ ప్రాంత స్థితిగతులను మార్చేస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆగస్టు 1వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రధాని షెడ్యూల్ ఖరారు అయ్యింది. 2014లో నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో మొదలైన భోగాపురం ఎయిర్ పోర్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి...రెండేళ్ల కాలంలో పూర్తి చేసింది. సర్వాంగ సుందరంగా తయారైన భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఎయిర్ పోర్టు ప్రారంభ కార్యక్రమంపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష చేశారు. సమీక్షకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, సిఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు, మంత్రులు సత్యకుమార్, అచ్చెన్నాయుడు, అనితతో పాటు పలువురు పాల్గొన్నారు. సమీక్షకు హాజరైన ఏవియేషన్ శాఖ అధికారులు, ఎయిర్ పోర్టు నిర్మించిన జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు భోగాపురం ఎయిర్పోర్టులో నిర్మాణ వివరాలు, వసతులు, సౌకర్యాలను వివరించారు. ఎయిర్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన 8 కీలక అనుమతులు ఇప్పటికే పొందినట్లు వివరించిన అధికారులు వివరించారు.

**ఉత్తరాంధ్ర ఇక అన్ స్టాపబుల్ :** ఈ సందర్భంగా

మిగతా 2లో...



- చరిత్రలో నిలిచేలా ప్రారంభోత్సవం నిర్వహించాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఆగస్టు 1న ప్రధాని చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభం
- చరిత్రలో నిలిచేలా ప్రారంభోత్సవం జరగాలి
- భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం
- కొత్త ఎయిర్ పోర్టు కొత్త అవకాశాలు తీసుకొస్తుంది



# జపాన్‌పై సింధు సింహగర్జన!

- జపాన్ ఓపెన్ సూపర్-750 టైటిల్ గెలిచిన తొలి భారత షట్లర్
- యమగుచిపై వరుస గేముల్లో విజయం.. చరిత్ర సృష్టించిన తెలుగు తేజం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు తేజం, స్టార్ షట్లర్ పీవీ సింధు సరికొత్త చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో జపాన్‌కు చెందిన స్టార్ ప్లేయర్ యమగుచిపై వరుస గేముల్లో సింధు గెలిచింది. ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 21-17, 21-17 తేడాతో యుమగుచి ని ఓడించింది. ప్రతి గేమూ చివరి వరకూ హోరాహోరీగానే సాగింది. అయితే, ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 50 నిమిషాల్లోనే సింధు మ్యాచ్‌ను ముగించింది.

**పట్టు వదలకుండా.. :** యమగుచిపై సింధుకు ఘనమైన రికార్డేమీ లేదు. 2026లో ఈ మ్యాచ్ కాకుండా మరో మూడింట్లో ఇరువురూ తలపడ్డారు. అందులో రెండుసార్లు యుమగుచినే విజయం సాధించింది. మలేషియా ఓపెన్‌లో యమగుచి మధ్యలోనే రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లడంతో సింధుకు విజయం వరించింది.

మిగతా 2లో...

# ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ దేశానికే ఆదర్శం




- జాతీయ వేదికపై ఏపీ ఆరోగ్యశాఖ జయకేతనం
- రెండు జాతీయ అవార్డులతో మెరిసిన ఆంధ్రప్రదేశ్
- వృద్ధుల సంక్షేమం.. డిజిటల్ ఆరోగ్య సేవల విభాగాల్లో రెండు అవార్డులు
- సంక్షేమం నుంచి సాంకేతికత వరకు... ఏపీ ఆరోగ్యశాఖ దేశానికే ఆదర్శం
- మంత్రి సత్యకుమార్ సారథ్యంలో ఆరోగ్యశాఖకు జాతీయ గుర్తింపు, ప్రశంసలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సేవలకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 4వ "చింతన్ శివిర్" సమీక్షా సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు దక్కడం రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థ సాధించిన పురోగతికి నిదర్శనంగా నిలిచింది. వృద్ధుల ఆరోగ్య భద్రత, డిజిటల్ ఆరోగ్య సేవల అమలులో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలవడం విశేషం.


న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఆయుష్మాన్ వయో వందన కార్డుల నమోదు మరియు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర ప్రభుత్వం సత్కరించింది.

**వృద్ధుల సంక్షేమంలో దేశానికే ఆదర్శం :** 70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఆరోగ్య భద్రత కల్పించే

మిగతా 2లో...



# వేడెక్కనున్న పార్లమెంట్



- నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- ఆగస్టు 13 వరకు సమావేశాలు.. 8 బిల్లులకు కేంద్రం సిద్ధం
- వందేమాతరం బిల్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లు తొలి రోజే

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగే ఈ సమావేశాల్లో కీలక శాసన కార్యక్రమాలతో పాటు పలు రాజకీయ అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడీ చర్చలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమావేశాల సందర్భంగా ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎనిమిది బిల్లులను సిద్ధం చేసింది.

తొలి రోజే రెండు కీలక బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 33 నుంచి 37కు పెంచే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుండగా, 'వందేమాతరం' గేయానికి జాతీయ గీతం హోదా కల్పించే బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

మిగతా 2లో...

# గ్లోబల్ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ఏపీ

- పెట్టుబడులకు అపార అవకాశాలు.. ప్రభుత్వ పూర్తి సహకారం
- జైపూర్ అంతర్జాతీయ కాన్‌క్లేవ్‌లో మంత్రి కందుల దుర్గేష్ ఆహ్వానం

**రాజస్థాన్ (జైపూర్) (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ప్రమోట్ చేయడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలోనే రాయల్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా, రోల్ మోడల్ గా నిలిచిన రాజస్థాన్‌లోని జైపూర్‌లో మంత్రి దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా జైపూర్ కుకాస్ లోని విరాసత్ హెరిటేజ్ రెస్టారెంట్ లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్ (ఐడబ్ల్యూటీసీ) లో ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్ ప్లానర్లు, ఈవెంట్ నిర్వాహకులతో మంత్రి దుర్గేష్ కీలక సమావేశాన్ని నిర్వహించారు.

మిగతా 2లో...




# పార్లమెంట్‌లో 'నేషన్ ఫస్ట్' స్వరం!



- రాష్ట్ర ప్రయోజనాల సాధనకు ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి
- జనసేన ఎంపీలకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం..
- వర్షాకాల సమావేశాలకు వ్యూహరచన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంట్ చర్చల్లో జాతీయ దృక్పథంతో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా, నేషన్ ఫస్ట్ అనే భావన స్పష్టంగా ప్రతిఫలించాలని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన అంశాలను బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో జనసేన పార్టీ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చర్చకు రానున్న బిల్లులు, వాటిపై పార్టీ వైఖరి, అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ కళ్యాణ్ సమగ్రంగా చర్చించారు. సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై మార్గనిర్దేశం చేశారు.

మిగతా 2లో...

# తమ్మినేని కుటుంబంపై కేసు

- రూ.4 కోట్ల విలువైన స్థలం కోసం నకిలీ పత్రాలతో కుట్ర ఆరోపణలు
- 13 మందిపై కేసు.. 8 మంది అరెస్ట్.. మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులపై దర్యాప్తు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 8 మందిని అరెస్ట్ చేశారు. శ్రీకాకుళంలో రూ. 4 కోట్ల విలువైన భూ కబ్జాకు కుట్ర చేశారనే ఆరోపణలపై సబ్ రిజిస్ట్రార్ అరుణతో పాటు మొత్తం 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో కేసును పర్యవేక్షిస్తున్నారు. వృత్తి రీత్యా హైదరాబాద్‌లో ఉన్న వ్యక్తికి శ్రీకాకుళంలో స్థలం ఉంది. దాని విలువ కోట్లలో ఉండటంతో తమ్మినేని సీతారాం కుటుంబం కన్ను



మిగతా 2లో...



# ఇంద్రకీలాద్రిపై భక్తి సంద్రం

- ఇంద్రకీలాద్రికి వేలాదిగా మహిళా భక్తుల రాక
- ఒక్కరోజే 23,916 మంది సాంప్రదాయబద్ధంగా సారె సమర్పణ

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాస సారె ఉత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. ఆషాఢ సారె ఉత్సవాల్లో ఐదో రోజైన ఆదివారం సెలవుదినం కావడంతో

మిగతా 3లో...

# కాశీ-అయోధ్యకు భక్తి రైలు

- అనకాపల్లి నుంచి ప్రత్యేక రైలు ప్రారంభించిన ఎంపీ సీఎం రమేష్
- దశలవారీగా ప్రతి అర్హ భక్తుడికీ అవకాశం

**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ ప్రజల కోసం

మిగతా 2లో...



## ఆకాశమే హద్దుగా భోగాపురం



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకం కానుంది. సామాన్యుల జీవితాలను మార్చే విధంగా ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రలో కొత్త అవకాశాలను తీసుకువస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ ఉరుకులు పెడుతుంది. రాకపోకలు మొదలయ్యాక ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. సామాన్యులు కూడా అనేక రకాలుగా లబ్ది పొందుతారు. రవాణా మాత్రమే కాకుండా...టూరిజం, పారిశ్రామికపరంగా కూడా ఈ ప్రాంత అభివృద్ధికి ఈ ఎయిర్ పోర్టు ఉపయోగపడుతుంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఈ ఎయిర్ పోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో వచ్చిన శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఆ ప్రాంతంలో ఎటువంటి మార్పులు తెచ్చిందో నేడు భోగాపురంతో ఆ ప్రాంతంలోనూ అటువంటి మార్పులే తెస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ పెరిగి అన్ని వర్గాలకు ఉద్యోగ, ఉపాధి అవకశాలు కలుగుతాయి. సంపద సృష్టికి అవకాశం ఏర్పడుతుంది. సాగునీటి ప్రాజెక్టులు, హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుంది... రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర అన్‌స్టాపబుల్" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రతి పౌరుడు, ప్రతి కుటుంబం సెలబ్రేట్ చేసుకోవాలి :** "ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ఎయిర్ పోర్టులో ప్రతి విభాగాన్ని తీర్చిదిద్దాలి. ప్రధాని చేతుల మీదు జరిగే ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోవాలి. గిరిజన సంస్కృతి, హస్తకళలు గుర్తు చేసేలా స్వాగత కార్యక్రమం ఉండాలి. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభాన్ని ఉత్తరాంధ్రలోని ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు సెలబ్రేట్ చేసుకోవాల్సిన శుభసందర్భం. ప్రతి పౌరుడూ ఎయిర్ పోర్టును చూసి గర్వించే పరిస్థితి రావాలి. ఉత్తరాంధ్రలో దీన్ని పండుగలా చేసేలా ప్రజలను, విద్యార్థులను, యువతను భాగస్వాములను చేయాలి"అని సీఎ చంద్రబాబు ఆదేశించారు.

## వేడెక్కనున్న పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

అయితే అయోధ్య రామమందిరం విరాళాల వినియోగం, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, మణిపుర్ పరిస్థితులు, ఇంధన విధానాలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రతిపక్షాలు ఇప్పటికే ప్రకటించాయి.

**అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్లు :** సమావేశాలకు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అయోధ్య రామమందిరం విరాళాల వినియోగం, నీట్ పేపర్ లీకేజీ, పెట్రోల్‌లో ఈ-20 ఇంధన మిశ్రమం, మణిపుర్ పరిస్థితులపై పార్లమెంట్‌లో చర్చ నిర్వహించాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల ఆధారంగానే అమలు చేయాలని డీఎంకే కోరింది.

**విపక్షాల అభిప్రాయాలకు ప్రాధాన్యం: కేంద్రం**

పార్లమెంట్ సమర్థవంతంగా పనిచేస్తే దేశానికి మేలు జరుగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఉభయ సభల్లో ప్రతిపక్షాల అభిప్రాయాలను ప్రభుత్వం ఆలకిస్తుందని, చర్చల అనంతరం ప్రవేశపెట్టే బిల్లులకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. అవసరమైతే అదనపు బిల్లులను కూడా బిజినెస్ అడ్వైజరీ కమిటీతో సంప్రదించిన తర్వాతే ప్రవేశపెడతామని స్పష్టం చేశారు.

**అఖిలపక్ష సమావేశంలో వాకౌట్ :** అఖిలపక్ష సమావేశంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్షాలు సమావేశం నుంచి వాకౌట్ చేశాయి.

తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన తిరుగుబాటు ఎంపీలకు సమావేశానికి ఆహ్వానం ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. అనంతరం చర్చల తర్వాత ప్రతిపక్ష సభ్యులు తిరిగి సమావేశంలో పాల్గొన్నారు.

అధికార పక్షం కీలక బిల్లులను ముందుకు తీసుకురావాలని భావిస్తుండగా, ప్రతిపక్షాలు పలు ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రాజకీయంగా ఆసక్తికరంగా మారనున్నాయి.

## పార్లమెంట్‌లో 'నేషన్ ఫస్ట్' స్వరం!



(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు వేదికగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ప్రతి అంశంపై జనసేన పార్టీ తరఫున గళం వినిపించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రాజెక్టులకు మరిన్ని నిధులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నాలు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్న రైల్వే ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ ప్రాజెక్టులకు ఆమోదం, నిధుల కేటాయింపు, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ అభివృద్ధి వంటి అంశాలపై ఎంపీలతో చర్చించారు. రాష్ట్రానికి గరిష్ట ప్రయోజనాలు చేకూరేలా ప్రతి అంశంపై సమగ్ర అవగాహనతో మాట్లాడాలని ఎంపీలకు పవన్ కళ్యాణ్ సూచించారు.

ఈ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్న నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు వంటి కీలక బిల్లులపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ప్రతి అంశంలోనూ ప్రజల ఆకాంక్షలు, జాతీయ ప్రయోజనాలు, రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మక చర్చలు జరపాలని సూచించారు.

దేశ ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల సాధనే జనసేన పార్టీ లక్ష్యమని, అదే దిశగా పార్లమెంటు సమావేశాల్లో పార్టీ ఎంపీలు చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఈ సమావేశంలో పార్టీ లోక్ సభ సభ్యులు వల్లభనేని బాలశౌరి , తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్ పాల్గొన్నారు.

# జపాన్‌పై సింధు సింహగర్జన!

(మొదటి పేజీ తరువాయి)

థాయ్‌లాండ్ ఓపెన్ క్వార్టర్స్‌లో సింధుపై యమగుచి గెలిచింది. అలాగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఈ జపాన్ ప్లేయర్‌దే విజయం. దీంతో ఇప్పుడీ ఫైనల్‌లో పీవీ సింధుపై కాస్త ఒత్తిడి ఉంది. కానీ, ఎక్కడా దానిని బయటపెట్టలేదు. తొలి పాయింట్ నుంచి మ్యాచ్ గెలిచే వరకూ పట్టువదల్లేదు. మధ్యలో యుమగుచి నుంచి కాస్త పోటీ ఎదురైనా.. సంయమనం కోల్పోకుండా వరుసగా రెండు గేములను కొట్టేసింది.

**జపాన్ ఓపెన్ టైటిల్ విజయం.. పీవీ సింధు భావోద్వేగం :** జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు తన గెలుపుపై స్పందించింది. ఈ టైటిల్ అందుకున్న తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించిన సింధు.. భావోద్వేగానికి గురైంది. కష్టకాలంలో కూడా తనపై నమ్మకం కోల్పోలేదని.. అదే తన విజయానికి కారణమైందని వెల్లడించింది. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరును కొనసాగించి రికార్డు స్థాయిలో ఆరో పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేసింది. కాగా ఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన స్టార్ ప్లేయర్ యమగూచిపై 21-17, 21-17 వరుస సెట్లలో సింధు గెలుపొందిన సంగతి తెలిసిందే.

'ఈ గెలుపు నాకు ఎంతో ప్రత్యేకం. చాలా కాలంగా దీని కోసమే కష్టపడుతున్నాను. గెలిచిన వెంటనే నా కళ్లలో ఆనందభాష్పాలు వచ్చాయి. గత 19 నెలలుగా టైటిల్ కోసం ఎదురుచూస్తున్నాను. చాలా మంది 'ఇక సింధు పని అయిపోయిందా?' అని ప్రశ్నించినా.. నేను మాత్రం నా మీద నమ్మకం కోల్పోలేదు. నేను చేయగలనని ఎప్పుడూ విశ్వసించాను. ఆ నమ్మకమే నన్ను గెలిపించింది.



ఈ ప్రయాణంలో నాకు తోడున్న నా కోచ్‌లకు, నా వెన్నంటే ఉన్న తల్లిదండ్రులు, నా భర్త, అత్తమామలకు కృతజ్ఞతలు ' అని సింధు వెల్లడించింది. 2024 డిసెంబర్‌లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ గెలిచిన తర్వాత సింధుకు ఇది తొలి మేజర్ టైటిల్. అలాగే 2019 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన తర్వాత ఆమె ఖాతాలో చేరిన అత్యంత ప్రతిష్ఠాత్మక గెలుపు కూడా ఇదే.

**ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై గురి :** ఆగస్టు 17 నుంచి 23 వరకు భారత్ వేదికగా జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ విజయం తనలో అపార ఆత్మవిశ్వాసాన్ని నింపిందని సింధు తెలిపింది. ఇప్పటికే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు గెలిచిన ఆమె.. మరో పతకం సాధిస్తే మహిళల సింగిల్స్‌లో ఆరు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు గెలిచిన తొలి ప్లేయర్‌గా చరిత్ర సృష్టించనుంది. 'ఇప్పుడున్న ఆటతీరు, ప్రశాంతత, ఆత్మవిశ్వాసాన్ని అలాగే కొనసాగించాలి. ఈ విజయానికి ఇదే సరైన సమయం. ఇదే జోరును ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ కొనసాగించాలను కుంటున్నాను. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ప్రశాంతంగా ఉండటం చాలా ముఖ్యం. అటాకింగ్ గేమ్ నా బలం. ఇప్పుడు కోర్టులో స్వేచ్ఛగా కదులుతూ దూకుడుగా ఆడగలుగుతున్నాను. అ-నవసర తప్పిదాలను తగ్గించగలిగితే మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధించవచ్చు. అదే ఈ టోర్నీలో నాకు కలిసొచ్చింది' అని సింధు వివరించింది.

25

**ఇది చారిత్రాత్మక విజయం.. పీవీ సింధు గెలుపుపై ప్రధాని ప్రశంసలు**

జపాన్ ఓపెన్ 2026లో విజయం సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు గెలుపుపై ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా ప్రశంలు కురిపించారు. భారత బ్యాడ్మింటన్‌కు ఇది చారిత్రాత్మక విజయం అని పేర్కొన్నారు. టోర్నమెంట్ అంతటా ఆమె పట్టుదల, అసాధారణ నైపుణ్యాలు ప్రస్ఫుటంగా కనిపించాయన్నారు. ఈ టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలు సింధు కావడం, ఈ ఘనతను మరింత ప్రత్యేకంగా నిలపుతుందని అభినందించారు. ఈ విజయం దేశంలోని యువ క్రీడాకారులు ఆటల్లో రాణించడానికి ప్రేరేపిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలిచిన సింధు ఈ టైటిల్ అందుకున్న తొలి భారత మహిళగా రికార్డు క్రియేట్ చేసింది. ఫైనల్స్ లో జపాన్ ప్లేయర్ యమగూచిపై 21-17, 21-17 వరుస సెట్ల తేడాతో విజయం సాధించింది. 2020లో కామన్వెల్త్ గేమ్స్ లో సింధు పసిడి పతకం సాధించగా తరవాత ఎడమకాలి మడమ గాయం కారణంగా ఫామ్ కోల్పోయింది. అప్పటి నుండి తీవ్రఒడిదొడుకులు ఎదుర్కొంటూ తాజా విజయంతో మరోసారి సత్తా చాటింది. తిరిగి ఫామ్ లోకి వచ్చినట్టు ప్రపంచానికి చాటిచెప్పింది.

# ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంతో అమలు చేస్తున్న ఆయుష్మాన్ వయో వందన కార్యక్రమంలో రాష్ట్రం విశేష ఫలితాలు సాధించింది. ప్రతి లక్ష మంది వృద్ధులకు అత్యధిక కార్డులు నమోదు చేసిన పెద్ద రాష్ట్రాల విభాగంలో తొలి స్థానం సాధించి జాతీయ అవార్డును అందుకుంది.

ఈ కార్డు ద్వారా ప్రతి అర్హ వృద్ధుడికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య బీమా రక్షణ లభిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 13 లక్షల మందికి పైగా వృద్ధులను నమోదు చేయడం ద్వారా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సమర్థవంతంగా కార్యక్రమాన్ని అమలు చేసింది. ప్రతి లక్ష మంది వృద్ధుల్లో 36 వేల మందికి పైగా నమోదు పూర్తి కావడం రాష్ట్ర యంత్రాంగం పనితీరుకు నిదర్శనంగా నిలిచింది.

**డిజిటల్ ఆరోగ్య సేవల్లోనూ అగ్రస్థానం :** ఆరోగ్య రంగంలో సాంకేతికత వినియోగాన్ని విస్తరించడంలోనూ ఆంధ్రప్రదేశ్ ముందంజలో నిలిచింది. ప్రతి లక్ష జనాభాకు అత్యధిక ఆరోగ్య రికార్డులను డిజిటల్ విధానంలో అనుసంధానం చేసినందుకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద కూడా రాష్ట్రానికి జాతీయ అవార్డు లభించింది.

డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా రోగుల వైద్య



వివరాలు సులభంగా అందుబాటులోకి రావడంతో చికిత్స మరింత వేగవంతం, పారదర్శకంగా మారుతోంది. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఈ వ్యవస్థ కీలకంగా మారింది.

**మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వానికి జాతీయ గుర్తింపు:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో సేవల నాణ్యత పెంపు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల సమర్థ అమలు, డిజిటల్ సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ఆరోగ్యశాఖ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ప్రాధాన్యత సంతరించుకుంది.

శాఖలో నిరంతర పర్యవేక్షణ, లక్ష్యాల ఆధారిత కార్యాచరణ, ప్రజలకు చేరువయ్యే విధంగా సేవలను విస్తరించడంపై తీసుకున్న చర్యలు ఈ విజయాలకు దోహదపడ్డాయని అధికారులు పేర్కొంటున్నారు.

**అధికారుల కృషికి మంత్రి సత్యకుమార్ అభినందనలు :** ఈ సందర్భంగా రెండు జాతీయ అవార్డులు రాష్ట్రానికి దక్కడం పట్ల మంత్రి సత్యకుమార్ యాదవ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు, జాతీయ ఆరోగ్య మిషన్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో భాగస్వాములైన అన్ని స్థాయిల సిబ్బందిని అభినందించారు. ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన, సాంకేతికత ఆధారిత ఆరోగ్య సేవలు అందించే దిశగా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతను కేంద్రంగా చేసుకుని అమలు చేస్తున్న కార్యక్రమాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# గ్లోబల్ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో వెడ్డింగ్ టూరిజం విస్తరణకు ఉన్న అనుకూలతలు, సహజసిద్ధమైన వనరులు మరియు ప్రభుత్వ రాయితీలపై మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు పర్యాటక రంగానికి కల్పిస్తున్న ప్రాముఖ్యతను తెలిపారు. అంతకుముందు గుజరాత్ ఉప ముఖ్యమంత్రి, పర్యాటక మంత్రి దియా కుమారితో కలిసి ఆంధ్రప్రదేశ్ టూరిజం స్టాల్ ను మంత్రి దుర్గేష్ ప్రారంభించి పలువురికి ఏపీ ప్రత్యేకతలను స్వయంగా తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్భుతమైన ప్రకృతి అందాలు, చారిత్రాత్మక కోటలు, సుదీర్ఘమైన సముద్ర తీరాలతో వెడ్డింగ్ డెస్టినేషన్లకు అత్యంత అనువైన ప్రాంతంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి బీచ్ వెడ్డింగ్స్ నిర్వహించుకోవడానికి హిల్ రిసార్ట్స్ కలయికతో ఉన్న వైజాగ్ తీరం ఎంతో రమణీయంగా ఉంటుందని వివరించారు. సూర్యలంక బీచ్ లో స్టార్ హోటళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పచ్చని ప్రకృతి, గిరిజన సంస్కృతి, ఎకో-టూరిజం వైభవం మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందిన 'అరకు కాఫీ' విశిష్టతలతో అరకు పర్యాటకులను కట్టిపడేస్తుందని తెలిపారు. పచ్చని కొండలు, చల్లని వాతావరణం, పొగమంచు మధ్య ప్రశాంతంగా వేడుక జరుపుకోవాలనుకునే వారికి అరకు ఉత్తమమైన ప్రాంతం అని పేర్కొన్నారు. అదే గాక



కోనసీమ ప్రాంతం పచ్చని కొబ్బరిచెట్లతో, మారేడుమిల్లి దట్టమైన అటవీ ప్రాంతంతో సుందరంగా ఉంటుందన్నారు. సాంప్రదాయ పద్ధతిలో, వైభవంగా వివాహం చేసుకోవాలనుకునే వారికి తిరుపతి మొదటి ప్రాధాన్యతగా మారుతోందని, ప్రస్తుతం అక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'వరల్డ్ క్లాస్ హోటల్స్' అందుబాటులోకి వస్తున్నాయని మంత్రి తెలిపారు. రామ్ దేవ్ బాబా ఏపీలో వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.

మంత్రి దుర్గేష్ స్పీచ్ తో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి వెడ్డింగ్ డెస్టినేషన్ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టేందుకు పలువురు వెడ్డింగ్ ప్లానర్లు సుముఖత వ్యక్తం చేశారు. ఏపీలో ఈవెంట్స్, టూరిజం ప్రాజెక్టులు చేపట్టే వారికి కూటమి ప్రభుత్వం తరపున సింగిల్ విండో విధానంలో అనుమతులు, అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, నూతన పర్యాటక పాలసీ 2024-29తో ఇన్వెస్టర్లకు రాయితీలు ఇస్తున్నామన్నారు. ఇవేగాక హోమ్ స్టే, క్యారవాన్, ల్యాండ్ అలాట్ మెంట్, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ తదితర అనుబంధ పాలసీలు అమలు చేస్తున్నామన్నారు. ఫిల్మ్ టూరిజంకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగ వృద్ధికి, ఉపాధి కల్పనకు వెడ్డింగ్ టూరిజం ఎంతో దోహదపడుతుందని, త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఏపీలో పర్యటించాలని స్థానిక నిర్వాహకులను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు. ప్రకృతి ప్రసాదించిన అన్ని రకాల అందాలు ఏపీ సొంతమని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం తరపున అండగా ఉంటామని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఈవెంట్ ప్రొఫెషనల్స్, హాస్పిటాలిటీ రంగానికి చెందిన ప్రముఖులు, ఇన్వెస్టర్లు, వెన్యూ ఓనర్స్, ట్రావెల్ అండ్ ట్రేడ్ పార్ట్‌నర్స్, టూరిజం స్టేక్ హోల్డర్స్, వెడ్డింగ్ డెస్టినేషన్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాక్రోచ్ పార్టీ 'పార్లమెంట్ మార్చ్'కు అనుమతి లేదు

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన 'చలో సంసద్' (పార్లమెంట్ మార్చ్) యాత్రకు అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. న్యూఢిల్లీలో దీచీూా సెక్షన్ 163 (పాత జతీూజ సెక్షన్ 144) అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడడం, ర్యాలీలు, నిరసనలు చేపట్టడంపై నిషేధం విధించారు.

**జంతర్ మంతర్ వద్దే అనుమతి..**

ముందస్తు అనుమతితో కేవలం జంతర్ మంతర్ వద్ద మాత్రమే నిరసనలు తెలియజేయడానికి అవకాశముందని, పార్లమెంట్ వైపు మార్చ్‌కు అనుమతి లేదని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే దీచీూా సెక్షన్ 223తో పాటు ఇతర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్లమెంట్ స్ట్రీట్, సెంట్రల్ విస్టా, జంతర్ మంతర్ వంటి సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, బారికేడ్లు, పికెట్లను ఏర్పాటు చేశారు.

## తమ్మినేని కుటుంబంపై కేసు

(మొదటి పేజీ తరువాయి)

పడింది. దీంతో ఆ స్థలాన్ని నకిలీ పత్రాలతో దక్కించుకునేందుకు కుట్ర చేశారు. ఈ మేరకు తమ్మినేని సతీమణితో పాటు కుమారుడు చిరంజీవి నాగ్ కూడా అరెస్ట్ అయ్యారు.

ఓ భూ వ్యవహారంలో వైఎస్సార్సీపీ నేత, శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో పాటు ఆయన కుటుంబసభ్యులపై శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మధ్యవర్తిత్వం చేసిన వారితో పాటు మొత్తం 13 మందిపై కేసు నమోదవగా 8 మందిని అరెస్ట్ చేసినట్లు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు.

**వ్యక్తి బతికి ఉండగానే చనిపోయినట్లు :** "శ్రీకాకుళంలోని బలగ పరిధి సర్వే నంబర్ 35/13లో ఉన్న రూ.3 -4కోట్ల విలువైన భూమి కబ్జాకు కొందరు యత్నించారు. ఈ భూమికి సంబంధించి 1992-1998 మధ్య కొన్ని అమ్మకాల లావాదేవీలు జరిగాయి. అంధవరపు గోవిందరాజులు అనే వ్యక్తి బతికి ఉండగానే చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రం సృష్టించారు. ఒడిశాలోని జయపురకు చెందిన అడబాల రజనీని గోవిందరాజులు కుమార్తె అంధవరపు రజనీగా చూపించి తమ్మినేని చిరంజీవి నాగ్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. స్థలానికి ప్రహరీ నిర్మించే ప్రయత్నాన్ని అసలు యజమాని కుటుంబ సభ్యులు అడ్డుకుని పోలీసులను ఆశ్రయించడంతో నకిలీ పత్రాలు, తప్పుడు వారసత్వం సృష్టించడం, తప్పుడు రిజిస్ట్రేషన్ తదితర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఆమదాలవలస పరిధిలో అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. మాజీ స్పీకర్ తమ్మినేని కుమారుడు నాగ్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. తమ్మినేనితో పాటు ఆయన భార్య ప్రమేయం ఉందని గుర్తించాం. చాపరం పరిధిలో కొన్ని భూ అమ్మకం లావాదేవీలు జరిగాయి. గోవిందరాజులు చనిపోయినట్లు నకిలీ పత్రంతో రిజిస్ట్రేషన్ చేశారు. గోవిందరాజులుకు ఒకే కుమార్తె ఉందని నకిలీ పత్రం సృష్టించారు. ఒడిశా జయపూర్ వాసి రజినిని గోవిందరాజులు కుమార్తెగా చూపి రిజిస్ట్రేషన్. సరైన పత్రాలు లేకుండానే నాటి ఆమదాలవలస రిజిస్ట్రార్ అరుణ రిజిస్ట్రేషన్ చేశారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ కేసులో మధ్యవర్తిత్వం చేసిన 8 మంది అరెస్టు. ఈ కేసులో ఐదుగురిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం.

ఈ వ్యవహారం వెనుక తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి ఉన్నట్లు గుర్తించాం. ఈ కేసులో నిందితులుగా ఉన్న అడబాల రజనీ (A1), తెలుగు సతీష్‌కుమార్ (A2), సలిపిల్లి లక్ష్మణరావు (A3), ముదాడ్ల ఉపేంద్ర కుమార్ (A8), జెగురిపాటి ఉపేంద్ర రావు (A9), మామిడి గోపాలకృష్ణ (A10), సాంబాన సాంబశివరావు (A11), కూన పెద్దిరాజు (A12)ను అరెస్ట్ చేశాం. త్రినాథ్ (A4 ), తమ్మినేని చిరంజీవి నాగ్ (A5), తమ్మినేని సీతారాం (A6), తమ్మినేని వాణి (A7), బొడ్డేపల్లి అరుణ (A13) (సబ్‌రిజిస్ట్రార్)పై దర్యాప్తు కొనసాగుతోంది. మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తాం" అని ఎస్పీ తెలిపారు.

## కాశీ-అయోధ్యకు భక్తి రైలు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ సీఎం రమేష్ ప్రత్యేక అనకాపల్లి-కాశీ-అయోధ్య దివ్యదర్శన యాత్ర రైలును ప్రారంభించారు. 20 బోగీలతో కూడిన ఈ ప్రత్యేక రైలు 1,400 మంది భక్తులతో ఆదివారం అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఘనంగా బయలుదేరింది.

ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అయోధ్యలో శ్రీరామ జన్మభూమి, వారణాసిలో కాశీ విశ్వనాథ స్వామిని దర్శించే అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు అయోధ్య యాత్రతో పాటు కాశీ దర్శనాన్ని కూడా ఈ కార్యక్రమంలో భాగం చేసినట్లు తెలిపారు.

మొదట వారణాసిలో కాశీ విశ్వనాథ స్వామి దర్శనం, అనంతరం అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయాన్ని భక్తులు దర్శించుకుంటారని చెప్పారు. ఐదు రోజులపాటు సాగే ఈ యాత్రలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భోజనం, వసతి, రవాణా తదితర అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. యాత్రికుల స్వాగతం, సమన్వయం కోసం ప్రత్యేక వాలంటీర్ల బృందాన్ని ముందుగానే వారణాసికి పంపినట్లు తెలిపారు.

దేశంలోనే తొలిసారిగా ఒక పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో ఈ తరహా దివ్యదర్శన యాత్రను నిర్వహించడం విశేషమని సీఎం రమేష్ పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో నివసించే సామాన్య ప్రజలకు కూడా కాశీ, అయోధ్య వంటి పుణ్యక్షేత్రాలను దర్శించే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ప్రతి అర్హ భక్తుడికి దశలవారీగా ఈ యాత్ర అవకాశం కల్పిస్తామని, త్వరలోనే మరో ప్రత్యేక రైలును కూడా అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, కేఎస్ఎన్ రాజు, కార్పొరేషన్ ఛైర్మన్లు, కూటమి నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

యాత్రలో పాల్గొన్న భక్తులు కాశీ విశ్వనాథ స్వామి, అయోధ్య శ్రీరాముడి దర్శనం చేసుకునే అవకాశం కల్పించినందుకు ఎంపీ సీఎం రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత రైలు ప్రయాణంతో పాటు భోజనం, వసతి తదితర సదుపాయాలను కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## యూసీసీ బిల్లుకు మధ్యప్రదేశ్ కేబినెట్ ఆమోదం.. త్వరలో అసెంబ్లీకి!



**మధ్యప్రదేశ్( జర్నలిస్ట్ ఫైల్) :** యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) అమలు దిశగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఈ మేరకు సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కేబినెట్ సమావేశంలో యూసీసీ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'రాష్ట్ర చారిత్రక వారసత్వానికి ప్రతీకగా, సమాజంలో సమానత్వాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు. ఈ బిల్లు అమలుతో దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'మాకు రామ్ అయినా, రహీమ్ అయినా అందరూ ఒక్కటే. అందరికీ ఒకే చట్టం ఉండాలన్నదే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం' అని అన్నారు. ఈ చట్టంతో రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు ఎలాంటి భంగం కలగదనీ సీఎం స్పష్టం చేశారు.

అంతకుముందు.. ఈ బిల్లు రూపకల్పన కోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, డివిజన్లలో ప్రజాభిప్రాయాలను సేకరించిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ముస్లింల నుంచీ విశేష మద్దతు లభించిందన్న సీఎం.. ముస్లింలలో సుమారు 80 శాతం మహిళలు, 40 శాతం పురుషులు దీనికి అనుకూలంగా స్పందించారని చెప్పారు. భోపాల్‌లో పలు రాజకీయ పార్టీలు, సామాజిక, మత సంస్థల ప్రతినిధులతోనూ విస్తృత చర్చలు జరిపిందన్నారు. ఈ ప్రక్రియలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), కమ్యూనిస్టు పార్టీలు పాల్గొన్నప్పటికీ.. కాంగ్రెస్ మాత్రం దూరంగా ఉందని సీఎం విమర్శించారు. 'ఒకే దేశం-ఒకే చట్టం అనే భావనను కాంగ్రెస్ ఎప్పటినుంచో వ్యతిరేకిస్తోంది' అని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వ్యాఖ్యానించారు. కాగా.. రాష్ట్ర కేబినెట్ ఆమోదం పొందిన యూసీసీ బిల్లు త్వరలో రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అక్కడా ఆమోదం లభిస్తే మధ్యప్రదేశ్‌లో దీని అమలుకు మార్గం సుగమం కానుంది.

## ఇంద్రకీలాద్రిపై భక్తి సంద్రం

(మొదటి పేజీ తరువాయి)

దుర్గమ్మ సన్నిధికి మహిళా భక్తులు భారీగా పోటెత్తారు. జగన్మాతను తమ ఇంటి ఆడపడుచుగా భావించే భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు తదితర సారె సంభారాలతో తరలిరావడంతో పుణ్యక్షేత్రం జనసముద్రంగా మారింది. గడిచిన నాలుగు రోజులతో పోలిస్తే ఇవాళ ఏకంగా రెట్టింపు స్థాయిలో మహిళలు కొండపైకి విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

సాంప్రదాయబద్ధంగా సారెను సమర్పించి : ఉమ్మడి కృష్ణా, గోదావరి, గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాలతో పాటు తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే 57 భారీ సారె బృందాలు ఇంద్రకీలాద్రికి చేరుకోగా ఏకంగా 23,916 మంది భక్తులు దుర్గమ్మకు సాంప్రదాయబద్ధంగా సారెను సమర్పించి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. సారెతో వచ్చే మహిళా భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది. భవానీ అనుగ్రహ దర్శనానికి సంబంధించిన రూ. 100 క్యూలైన్‌ను పూర్తిగా సారె తీసుకొచ్చే భక్తులకే కేటాయించి, వేగంగా దర్శనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని బట్టి ఇతర క్యూలైన్లలోనూ వారిని అనుమతించారు.

**ఉచితంగా వేదాశీర్వచనం అందజేసి :** రద్దీ కారణంగా మహామండపంలోని 6వ అంతస్తు భక్తులతో కిక్కిరిసిపోయింది. అక్కడికి చేరుకున్న సారె బృందాలకు ఆలయ పండితులు, అర్చకులు ఉచితంగా వేదాశీర్వచనం అందజేసి, ప్రసాదాలు అందించారు. అనంతరం భక్తులందరినీ ప్రత్యేక క్యూ మార్గాల ద్వారా వేగంగా అన్నప్రసాద స్వీకరణకు పంపించారు. సారె బృందాల రద్దీని ముందస్తుగా అంచనా వేసేందుకు దేవస్థానం యాజమాన్యం సరికొత్త సాంకేతిక విధానాన్ని అమలు చేసింది. కనకదుర్గ నగర్ వద్ద సారె బృందాలు రిజిస్ట్రేషన్ చేసుకోగానే, ఆ సమాచారం క్షణాల్లో కొండపై ఉన్న 'స్కానింగ్ పాయింట్'కు చేరేలా అంతర్గత వ్యవస్థను అనుసంధానించారు. దీంతో కింద ఎంతమంది భక్తులు వస్తున్నారో పైనున్న అధికారులకు ముందే తెలియడం వల్ల, క్యూలైన్ల నిర్వహణ ఎంతో సులువవుతోంది.

**కొండపైకి వాహనాల రాకపోకలపై నియంత్రణ :** దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ ఈవో వి.కె. శీనానాయక్, ధర్మకర్తలమండలి సభ్యులు క్యూలైన్లను స్వయంగా పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సారె బృందాలతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో, వారి సౌకర్యార్థం కొండపైకి వాహనాల రాకపోకలపై నియంత్రణ విధించినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు ఆలయ సిబ్బంది సేవలందిస్తున్నారు.

## కేబినెట్‌లో ఉద్యోగుల హామీలపై నిర్ణయం తీసుకోవాలి

○ వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర రెడ్డి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఈనెల 23న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన ఎన్నికల హామీల అమలుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కేబినెట్ సమావేశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ను నియమించాలని, కనీసం 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) మంజూరు చేయాలని కోరారు.

అలాగే 2024 జూలై 1, 2025 జనవరి 1, 2025 జూలై 1, 2026 జనవరి 1 తేదీల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏ, డీఆర్ కిస్తులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను కూడా తక్షణమే చెల్లించే అంశంపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు గడిచినా ఇప్పటివరకు హామీల అమలులో పురోగతి కనిపించలేదని విమర్శించారు. ఇకపై కాలయాపన చేయకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన అన్ని పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐక్యంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టి రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఎన్. చంద్రశేఖర రెడ్డి హెచ్చరించారు.

## ఆరు వరుసలతో సొరంగాలు చాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి ప్రాంతానికి కీలకం కానున్న అమరావతి ఔటర్ రింగ్ రోడ్ డీపీఆర్‌లో మరో కోత విధించారు. ఎనిమిది లైన్ల రహదారి నిర్మాణానికి వీలుగా సొరంగాలు నిర్మించేలా ప్రతిపాదనలు పంపిచగా ఆరు వరుసల రహదారికే వాటిని పరిమితం చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఐ) నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఐ అధికారులు ప్రతిపాదనల్లో మార్పులు చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఓఆర్‌ఆర్ విస్తరించాలంటే సొరంగాలను విస్తరించడం సాధ్యం కాదని తెలిసినా దీనిని పరిగణనలోకి తీసుకోవడం లేదు.

అమరావతి ఓఆర్‌ఆర్‌ను 189.4 కిలోమీటర్ల మేర 6 వరుసలుగా నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం గంగినేని వద్ద అటవీ ప్రాంతంలో 2.78 కిలోమీటర్లు 1.69 కిలోమీటర్లలతో, గుంటూరు జిల్లా పేరేచెర్ల అటవీ ప్రాంతంలో 0.51 కిలోమీటర్లతో కలిపి మొత్తం 4.98 కిలోమీటర్ల మేర మూడు సొరంగాలు నిర్మించనున్నారు. ఒక్కో చోట వెళ్లే వాహనాలకు ఒకటి, వచ్చే వాహనాలకు మరొకటి చొప్పున ఈ సొరంగాలు ఉంటాయి.

వీటిలో ఒకవైపు నాలుగు, మరోవైపు మరో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి వీలుగా మొత్తం 8 లైన్ల రహదారి ఉండేలా సొరంగాలు ఉండాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఓఆర్‌ఆర్ ప్రస్తుతం 6 వరుసలతో నిర్మించనున్నారు. భవిష్యత్‌లో 8 వరుసలుగా విస్తరించినా ఇబ్బంది లేకుండా సొరంగాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అయితే 8 లైన్ల రహదారులు నిర్మించేలా సొరంగాలు అవసరం లేదని, ఆరు వరుసల రహదారులకు అనుగుణంగా తవ్వితే చాలంటూ ఎన్‌హెచ్‌ఐ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

గతంలో పంపిన ప్రతిపాదనల్లో మార్పులు చేసి పంపాలని కోరారు. ఇలా చేస్తే ఓఆర్?ఆర్?ను 6 లైన్ల నుంచి 8 వరుసలుగా విస్తరించాలంటే మూడు టన్నెల్స్ వద్ద సాధ్యం కాదు. కొత్త టన్నెల్స్ నిర్మాణ ఖర్చు ఎక్కువవుతుంది. అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా ప్రాజెక్ట్ వ్యయం తగ్గింపే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

ఓఆర్‌ఆర్‌కు తొలుత రూ. 38,450 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత ఇందులో తెనాలి సమీపంలో ఓఆర్‌ఆర్ నుంచి చెన్నై- కోల్‌కతా హైవేలో కాజ వద్దకు చేరుకునేలా ఆరు లైన్లతో 17.5 కిలోమీటర్లు నిర్మించాలనుకున్న అనుసంధాన రహదారి - స్పర్ రోడ్ ప్రతిపాదనను తొలగించారు. ఓఆర్‌ఆర్‌కు ఇరువైపులా రెండేసి వరుసలతో సర్వీస్ రోడ్లు నిర్మించేలా ప్రతిపాదిస్తే ఇందులో బయటి వైపు సర్వీస్ రోడ్‌ను తొలగించి, లోపలి వైపు సర్వీస్ రోడ్‌కే సమ్మతించారు. ఇలాంటి కోతలతో ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ. 32,000ల కోట్లకు తగ్గించారు.

# ఫిఫా ప్రపంచకప్-2026 విశ్వవిజేతగా స్పెయిన్

- **ఫిఫా ఫైనల్లో అర్జెంటీనాపై 1-0తో విజయం**

**అదనపు సమయంలో ఫెర్రాన్ టోరెస్ విజేత గోల్**
**చెదిరిన మెస్సీ కల.. రన్నరప్‌తో సరిపెట్టుకున్న అర్జెంటీనా**
**ఫిఫా ఫైనల్‌లో తొలిసారి హాఫ్‌టైమ్ సంగీత ప్రదర్శనలు**





**న్యూయార్క్(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ఫుట్‌బాల్‌పై మరోసారి స్పెయిన్ తన ముద్ర వేసింది. న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో ఆదివారం అర్ధరాత్రి ఉత్కంఠభరితంగా జరిగిన ఫిఫా ప్రపంచకప్-2026 ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను 1-0 గోల్స్ తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. 2010లో తొలిసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్న స్పెయిన్, ఇప్పుడు రెండోసారి సాకర్ సింహాసనాన్ని అధిరోహించింది. నిర్ణీత 90 నిమిషాల ఆటతో పాటు ఇంజరీ టైమ్‌లోనూ ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. తొలి అదనపు అర్ధభాగంలోనూ స్కోరు మారకపోగా.. రెండో అదనపు అర్ధభాగం ప్రారంభంలోనే 109వ నిమిషంలో స్టార్ ఫార్వర్డ్ ఫెర్రాన్ టోరెస్ అద్భుత గోల్ నమోదు చేసి స్పెయిన్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. మిగిలిన సమయంలో అర్జెంటీనా సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా స్పెయిన్ డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది.

**మెస్సీని కట్టడి చేసిన స్పెయిన్ :** అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీకి అవకాశాలు ఇవ్వకుండా స్పెయిన్ ఆటగాళ్లు కట్టుదిట్టమైన రక్షణతో ఆడారు. మ్యాచ్ మొత్తం మెస్సీ ప్రభావాన్ని తగ్గించడంలో స్పెయిన్ విజయవంతమైంది. దీంతో వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్‌తో ఘనంగా వీడ్కోలు పలకాలన్న మెస్సీ ఆశలు నెరవేరలేదు.

**రెడ్‌కార్డుతో కష్టాల్లో అర్జెంటీనా :** మ్యాచ్ ముగింపునకు చేరువలో అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ ఎంజో ఫెర్నాండెజ్ రెడ్‌కార్డు అందుకోవడంతో జట్టు 10 మంది ఆటగాళ్లతోనే మిగిలిన సమయాన్ని ఆడాల్సి వచ్చింది. సంఖ్యాబలం తగ్గినా చివరి వరకు పోరాడినా ఫలితం దక్కలేదు.

**బలమైన డిఫెన్స్‌తో టైటిల్ :** టోర్నీ ఆరంభం నుంచి స్పెయిన్ అన్ని విభాగాల్లో సమతూకమైన ప్రదర్శన కనబర్చింది. ముఖ్యంగా డిఫెన్స్ అద్భుతంగా రాణించి మొత్తం టోర్నీలో ప్రత్యర్థులకు కేవలం ఒకే ఒక్క గోల్ మాత్రమే అవకాశం ఇవ్వడం విశేషం. ఫైనల్‌లోనూ అదే రక్షణ జట్టుకు టైటిల్‌ను అందించింది.

**చరిత్రలో కొత్త అధ్యాయం :** ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో ఫైనల్ మ్యాచ్ విరామ సమయంలో హాఫ్‌టైమ్ సంగీత ప్రదర్శనలు నిర్వహించడం ఇదే తొలిసారి. ప్రముఖ గాయకులు షకీరా, జస్టిన్ బీబర్ ప్రదర్శనలు అభిమానులను అలరించాయి. ఈ మ్యాచ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖ్య అతిథిగా వీక్షించారు.

**సంక్షిప్త స్కోరు :** ఫైనల్: స్పెయిన్ 1 (ఫెర్రాన్ టోరెస్ 109')

**అర్జెంటీనా 0**

**ఫలితం:** స్పెయిన్ 1-0తో విజయం; రెండోసారి ఫిఫా ప్రపంచకప్ విజేత.

# పరిశ్రమలతో స్థానికంగానే ఉద్యోగాలు

- **విద్య పూర్తికాగానే నివాస ప్రాంతంలోనే ఉపాధి అవకాశాలే లక్ష్యం**
- **విస్తృతంగా పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు కృషి : మంత్రి సవిత**



**హిందూపురం అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉన్నత విద్య పూర్తి కాగానే స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ బిడ్డలు ఉన్నత స్థానాల్లో ఉండాలన్న సంకల్పంతో సివిల్ సర్వీసెస్, డిఎస్సీ వంటి పరీక్షలకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు. ఈడిగలు, గౌడలను అన్నిరంగాల్లో రాణించేలా సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నీరా యూనిట్లు స్థాపించనున్నారని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో ఆదివారం ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. గీత కార్మికుల సంక్షేమానికి ఆది నుంచి సీఎం చంద్రబాబునాయుడు ప్రాధాన్యమిస్తూ వస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజులో 50 శాతం మేర రాయితీ ఇచ్చారన్నారు. 50 ఏళ్లు దాటిన గీత కార్మికులకు పింఛన్ అందజేసిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదేనన్నారు. గీత కార్మికులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నీరా యూనిట్లు స్థాపించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారని మంత్రి సవిత తెలిపారు.

**నివాసం ఉన్న చోటే ఉద్యోగాలు :** బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించడంతో పాటు ఉన్నత స్థానాల్లో కూడా నిలవాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం సివిల్ సర్వీసెస్, డీఎస్సీ, గ్రూప్ 2 సహా ఇతర పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత చదువులు చదివి పొట్టచేత పట్టుకుని నిరుద్యోగులు ఉద్యోగాలకు వలసలు వెళ్లే బాధలు తప్పేలా సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. విద్యాభ్యాసం పూర్తి కాగానే, స్థానికంగా ఉద్యోగాలు లభించేటట్లు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పరిశ్రమలు నెలకొల్పుతున్నారని మంత్రి సవిత వెల్లడించారు.

**హిందూపురం నందమూరి అడ్డా... :** హిందూపురం నియోజక వర్గం నందమూరి వంశీయులకు అడ్డాగా మారిందని మంత్రి సవిత అన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్... నేడు లెజండరీ నటుడు నందమూరి బాలకృష్ణకు హిందూపురం ఆదరిస్తూ వస్తోందన్నారు. హిందూపురం అభివృద్ధి ఎమ్మెల్యే బాలకృష్ణ అవిరళ కృషి చేస్తున్నారన్నారు. నియోజక వర్గంలో పరిశ్రమల స్థాపనతో పాటు మౌలిక సదుపాయలను కూడా పెద్ద ఎత్తున కల్పిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

**విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు :** టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు మంత్రి సవిత చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇంటర్ లో 80 శాతం మార్కులుపై పైబడిన సాధించిన ఈడిగ విద్యార్థులకు రూ. 10 వేలు, 80 శాతం కంటే తక్కువ వచ్చిన విద్యార్థులకు రూ. 8 వేల చొప్పున అందజేశారు. ఇంటర్ లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ల్యాప్ ట్యాప్ లను మంత్రి సవిత అందజేశారు. టెన్త్ లో 80 శాతం మార్కులు సాధించిన ఈడిగ విద్యార్థులకు రూ. 5 వేల చొప్పున అందజేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు రూ. 15 వేల చొప్పున అందజేశారు. 80 శాతం కంటే తక్కువ వచ్చిన విద్యార్థులకు రూ. 3 వేల చొప్పున అందజేశారు. ప్రతిభా పురస్కారాలు అందజేసిన ఈడిగ సామాజిక సంక్షేమ సంఘ ప్రతినిధులను మంత్రి సవిత అభినందించారు. విద్యార్థులు విద్య పట్ల పూర్తి స్థాయి దృష్టి సారించాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ అనుకున్న లక్ష్యాలకు చేరాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్ హరికృష్ణ, గోపాల్, మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య గౌడ్, అధిక సంఖ్యలో ఈడీగ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

## 72వ జాతీయ చలన చిత్ర పురస్కార విజేతలకు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు



- **నిహారిక కొణిదెల నిర్మించిన కమిటీ కుర్రోళ్లు ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయం:మంత్రి దుర్గేష్**
- **నేషనల్ ఫిలిమ్స్ లో 9 అవార్డులతో టాలీవుడ్ సత్తా చూపించడం గర్వంగా ఉంది:మంత్రి దుర్గేష్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో టాలీవుడ్ ఏకంగా 9 జాతీయ అవార్డులను కైవసం చేసుకుని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "భారతీయ చలనచిత్ర రంగంలో తెలుగు సినిమా మరోసారి తన జైత్రయాత్రను చాటిచెప్పడం ఆనందంగా ఉంది. నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వేదికపై 9 పురస్కారాలతో టాలీవుడ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించడం ప్రతి ఒక్క తెలుగువారికీ గర్వకారణం. ముఖ్యంగా నిహారిక కొణిదెల సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరియు శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై యువ ప్రతిభతో తెరకెక్కిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయం. పల్లెటూరి నేపథ్యంలో స్నేహం,కుటుంబ బంధాలు, సామాజిక విలువలు, భావోద్వేగాలను వెండితెరపై ఆవిష్కరించి జాతీయ అవార్డును అందుకోవడం ఈ చిత్ర బృందం సాధించిన ఘన విజయం" అని కొనియాడారు.

తెలుగు సినిమా కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా.. కథ, కథనం, నటన, సాంకేతిక నైపుణ్యం, కాస్ట్యూమ్ డిజైనింగ్, మేకప్ మరియు అద్భుతమైన నిర్మాణ విలువలు.. ఇలా 24 క్రాఫ్టుల్లోనూ తన తిరుగులేని ప్రతిభను చాటుకుందని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. వెండితెరపై తెలుగు వారి సృజనాత్మకతకు, కష్టానికి దక్కిన గౌరవం ఈ జాతీయ పురస్కారాలని ఆయన పేర్కొన్నారు.

భారతీయ చలనచిత్ర యవనికపై మన సినిమా కీర్తి పతాకాన్ని ఎగురవేసి, తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా చేసిన నటులు, దర్శకులు, నిర్మాతలు మరియు సాంకేతిక నిపుణులతో కూడిన చిత్ర బృందాలన్నింటికీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ ప్రకటన ద్వారా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో తెలుగు సినిమా మరిన్ని అంతర్జాతీయ శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

## 'మేడ్ ఇన్ ఇండియా' సీ-295.. ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశీయ రక్షణ, విమాన తయారీ రంగాల్లో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. తొలి స్వదేశీ ఎయిర్‌బస్ సీ-295 వ్యూహాత్మక సైనిక రవాణా విమానాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిచయం చేశారు. వడోదర(గుజరాత్)లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(టాటా) తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. ఈ సందర్భంగా ఓ వీడియోను సోషల్ మీడియా 'ఎక్స్'లో పంచుకున్నారు.

ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ కలలుగన్న 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలకు ఈ ప్రాజెక్ట్ ప్రతీకగా నిలుస్తుంది. దేశంలో విమాన తయారీ సామర్థ్యం వేగంగా పెరుగుతోంది. త్వరలో భారతీయులు పూర్తిగా స్వదేశీ విమానాల్లోనే ప్రయాణిస్తారు. ఆ రోజు కూడా ఎంతో దూరంలో లేదు' అని అన్నారు.

కాగా.. ఎయిర్‌బస్-టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఉమ్మడి భాగస్వామ్యంతో అమలవుతున్న సీ-295 ప్రాజెక్ట్ కింద తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఓ క్లిష్టమైన సైనిక విమానం భారత్‌లో తయారవుతోంది. దీనికి 2021లో 2.6 బిలియన్ డాలర్లతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం భారత్‌కు మొత్తం 56 సీ-295 విమానాలు అందించాలి. వీటిలో 16 విమానాలు స్పెయిన్‌లో మాన్యుఫాక్చర్ కానుండగా, మరో 40 విమానాలను వడోదరలో తయారు చేస్తున్నారు. అందులో భాగంగా.. తొలి సీ-295 విమానాన్ని జూన్ 10న విజయవంతంగా పరీక్షించారు. ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ ప్రాజెక్టును గురించి ప్రస్తావించారు. సీ-295 తయారీ వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు(ఎంఎస్ఎంఈలు) కొత్త అవకాశాలు లభిస్తాయని, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, నైపుణ్యాభివృద్ధి, దేశీయ ఏరోస్పేస్ పరిశ్రమ విస్తరణకు ఇది కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# పోలవరం ప్రాజెక్టు పూర్తికి - 43 అంశాలతో చెక్ లిస్ట్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పోలవరం ప్రాజెక్టును 2027 మార్చికి పూర్తిచేసే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు సూక్ష్మస్థాయి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా మొత్తం 43 అంశాలను గుర్తించారు. వీటి పూర్తికి ఇంకా 8 నెలలే గడువుంది. వీటిలో ప్రధాన డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 పూర్తిచేయడంలో ఇంకా వివిధ దశలు ఉన్నాయి. డిజైన్లు, అవసరమైన మెటీరియల్ సమీకరణ, స్పిల్ వే సుందరీకరణ, ఎడమ, కుడి కాలువలతో అనుసంధాన పనులు, పోలవరం స్పిల్ వేకు సమాంతరంగా ఎడమ, కుడి గట్టులను కలిపేలా ఐకానిక్ వంతెన, కేబుల్ వంతెన నిర్మించాలి.



దీంతోపాటు కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులు, ఆ రెండు కాలువల్లో మిగిలి ఉన్న పనులు సహా మొత్తం 43 అంశాలను సూక్ష్మ ప్రణాళికలో పొందుపరిచారు. ప్రధాన డ్యాంలో డిజైన్ల పెండింగ్ అంశాల నుంచి అన్నింటికీ స్థానం కల్పించారు. ఇందులో ప్రధాన డ్యాంతో పాటు అనుబంధ పనుల ప్రణాళిక ఈ విధంగా ఉంది.

వీటిలో గ్యాప్ 1, గ్యాప్ 2 డ్యాంల నిర్మాణం పూర్తిచేయడమే అన్నింటికన్నా ముఖ్యమైన లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్యాప్ 2 డ్యాంలో కుడి డ్యాం అబెట్‌మెంట్ పనులకు డిజైన్లు సమర్పించారు. జులై నెలాఖరుకు వీటికి అనుమతులు వస్తాయని భావిస్తున్నారు. ఇదే డ్యాంకు సంబంధించి ప్రస్తుతం ం23.32 మీటర్ల స్థాయి వరకే అనుమతులు లభించాయి. ఆపైన ం53.32 మీటర్ల వరకు డిజైన్లను కేంద్ర జలసంఘానికి సమర్పించారు. ఈ నెలలో వీటి అనుమతులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మరోవైపు గ్యాప్ 2 ప్రధాన డ్యాంలో 80 మీటర్ల చైనేజి నుంచి 1450 మీటర్ల చైనేజి వరకు పనుల తీరుపై అధికారులు సంతృప్తిగా ఉన్నారు. ప్రస్తుతం ం17 మీటర్ల స్థాయి నుంచి ం23.32 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జులై నెలాఖరుకు గ్యాప్ 2 డ్యాం మొత్తం ఈ స్థాయికి తీసుకొచ్చి ం53.32 మీటర్ల ఎత్తుకు పనులు మొదలు పెట్టాలి. ం23 మీటర్ల స్థాయికి పనులు పూర్తయితే గోదావరి సీపేజీ నీటి నుంచి కూడా పనులకు ఇబ్బంది లేకుండా మిగిలిన పై భాగం సులభంగా చేసుకోవచ్చనేది ఉద్దేశం. గ్యాప్ 1 డ్యాం నిర్మాణం ం33 మీటర్ల వరకు పూర్తయింది. ఆ పై నుంచి ం53.32 మీటర్ల వరకు పనులు చేపట్టారు. ఇది 2027 మార్చి నాటికి పూర్తిచేయాలనేది లక్ష్యం.

మరోవైపు ప్రధాన డ్యాం గ్యాప్ 1, 2 పూర్తిచేసేందుకు ఇంకా మెటీరియల్ అవసరం. అంటే 8.75 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి మొత్తమ్మీద అవసరం అనుకుంటే ఇప్పటివరకు 2.66 లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగించారు. 2.54 లక్షల క్యూబిక్ మీటర్లు డ్యాం వద్ద సిద్ధంగా ఉంది. కావాల్సిన మట్టిలో జులై నెలాఖరుకు మరో 1.50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి సమీకరిస్తారు. 2027 జనవరి నాటికి 2.05 లక్షల క్యూబిక్ మీటర్లు సిద్ధం చేయనున్నారు. 49.20 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం. ఇప్పటివరకు 8.70 లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగించారు. 13.10 లక్షల క్యూబిక్ మీటర్లు డ్యాం క్షేత్రం వద్ద సిద్ధంగా ఉంది. 2026 డిసెంబర్ నాటికి దశలవారీగా మిగిలిన రాయి కూడా సమీకరిస్తారు.

**గేట్ల ఆపరేషన్ షెడ్యూల్ :** పోలవరం ప్రాజెక్టు ప్రారంభించే సమయానికి గేట్ల ఆపరేషన్ షెడ్యూల్ సిద్ధంగా ఉంచుకోవాలి. ఐఐటీ రూర్కీ నిపుణులు ఈ ప్రణాళికను ప్రిపేర్ చేస్తున్నారు. 2026 డిసెంబర్‌కు సిద్ధం చేయాలనేది లక్ష్యం. మరోవైపు గ్యాంట్రీ, గేట్లకు సంబంధించి పెండింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం చివరికి పూర్తిచేస్తారు. గేట్ల నిర్వహణకు స్కాడా వ్యవస్థతో పాటు కంట్రోల్ రూం ఏర్పాటు పనులూ సాగుతున్నాయి. అప్రోచ్ ఛానల్?, స్పిల్ ఛానల్ పెండింగ్ పనులతో పాటు పైడిపాక కొండవద్ద గ్యాప్‌ను పూడ్చేయాలని భావిస్తున్నారు. ఈ అంశం పోలవరం ప్రాజెక్టు అథారిటీ పరిశీలనలో ఉంది.

### నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు

## నూతన సీఐగా ఆదిరెడ్డి బాధ్యతల స్వీకారంలి




**నల్గొండ, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆదిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు టూ టౌన్ సీఐగా విధులు నిర్వహించిన రాఘవరావు హాలియాకు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో ఆదిరెడ్డి నియమి తుల య్యారు. గతంలో నల్గొండలో పనిచేసిన అనుభవం ఉన్న ఆదిరెడ్డి పలు కీలక కేసులను ఛేదించి సమర్థ అధికా రిగా గుర్తింపు పొందారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, శాంతి భద్రతల పరిరక్షణపై పలు కీలక సూచనలు చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, గంజాయి ముఠాలు, సంఘవిద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ప్రజల భద్రతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఎస్పీ శివరాం రెడ్డిఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రజలు నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీఐ ఆదిరెడ్డి భరోసా ఇచ్చారు.

### మర్రిగూడ బైపాస్ ఫ్లైఓవర్‌ను వెంటనే

## ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్

– మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చర్లపల్లి వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు



**నల్గొండ, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రెండు నెలల క్రితమే ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినా ప్రారంభించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారని ఆందోళనకారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో మర్రిగూడ, పానగల్ బైపాస్ ఫ్లైఓవర్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పానగల్ ఫ్లైఓవర్ ఇప్పటికే ప్రారంభమైనప్పటికీ, మర్రిగూడ ఫ్లైఓవర్‌ను రాజకీయ కారణాలతో ప్రారంభించడం లేదని ఆరోపించారు. ధర్నాతో ఆ ప్రాంతంలో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వందలాది వాహనాలు నిలిచిపోయాయి. కలెక్టర్ వచ్చి సమస్యకు పరిష్కారం చూపే వరకు తాము వెనక్కి వెళ్లబోమని కంచర్ల భూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, పలువురు కార్పొరేటర్లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, ఇతర నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కనగల్ వైపు తరలించారు. ఈ ఘటనతో ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## దోమల నివారణకు గ్రామ పంచాయతీ చర్యలు..

– ఆత్మకూర్‌లోని మురుగు కాల్వల్లో డీటి పౌడర్



**ఆత్మకూరు, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలంలో దోమల వ్యాప్తిని అరికట్టి ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఆత్మకూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామంలోని మురుగు నీటి ప్రవాహ ప్రాంతాలు, కాల్వలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో శనివారం డీటి పౌడర్‌ను చల్లించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వేగంగా వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వారం నీటి నిల్వలను తొలగించడం, ఉపయోగంలో లేని పాత్రలు, టైర్లు, డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, వార్డు మెంబర్ బూడిద శేఖర్, గుండెగాని కిరణ్, కారోబార్ కూరెళ్ల కిష్టయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది మేడి యాదయ్య, ముత్తయ్య, చంద్రయ్య, నర్సమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## నల్లగొండ నగరపాలికకు కొత్త కమిషనర్...

– 15 రోజులుగా ఖాళీగా ఉన్న కమిషనర్ పోస్టుకు ప్రభుత్వం నియామకం..



**నల్లగొండ, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పోస్టు గత 15 రోజులుగా ఖాళీగా ఉండడంపై ఆదాబ్ హైదరాబాద్ ప్రచురించిన ప్రత్యేక కథనానికి ప్రభుత్వం స్పందించింది. ప్రత్యేక గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా వెయిటింగ్ ఫర్ పోస్టింగ్‌లో ఉన్న బి. వంశీ కృష్ణను నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పనిచేసిన కమిషనర్ పదవి విరమణ పొందగా తర్వాత నల్లగొండ నగరపాలికలో కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండడంతో పరిపాలనా నిర్ణయాలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఏర్పడుతుందనే అంశాన్ని ఆదాబ్ హైదరాబాద్ తన కథనంలో ప్రస్తావించింది. ఈ కథనంపై ప్రభుత్వం స్పందించి కొత్త కమిషనర్‌ను నియమించడంతో నగరపాలక సంస్థలో పూర్తిస్థాయి పరిపాలనకు మార్గం సుగమమైంది. నూతన కమిషనర్ బి. వంశీ కృష్ణ త్వరలో బాధ్యతలు స్వీకరించి పెండింగ్ అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, పౌర సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. నగరపాలిక కమిషనర్ నియామకంతో ప్రజలకు వేగవంతమైన సేవలు అందడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు



**ఆత్మకూర్, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామం లో గల శ్రీ దండు మైసమ్మ దేవాలయంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు తూడి నరసింహారావు ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గోపగాని వెంకటనారాయణ గౌడ్ మాట్లాడుతూ సూర్యాపేట ను అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత జగదీశ్వర్ రెడ్డికే దక్కుతుందన్నారు. మళ్లీ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను కోరు కుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్య నారాయణ రెడ్డి, జిల్లా నాయకులు మర్ల చంద్రారెడ్డి, బెల్లంకొండ యాదగిరి, ముద్దం కృష్ణారెడ్డి, సింగల్ విండో వైస్ చైర్మన్ బొల్లె జానయ్య, బత్తుల ప్రసాద్, మిర్యాల వెంకట్ రెడ్డి, సోమిరెడ్డి పెద్ద వెంకట్ రెడ్డి, గుంశా వలి, మాజి ఎంపీటీసీ లు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ ముఠా అరెస్ట్

# 40 చోరీ కేసులు ఛేదన.. రూ.53 లక్షల విలువైన సొత్తు స్వాధీనం




**మిర్యాలగూడ, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన జిటీ.చీశీ.257/2024 ఖ/సా 331(4), 305 దీచూ కేసు దర్యాప్తులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చోరీ ముఠాను నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, డి. చంద్రశేఖర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ సీఐ/ా.చీ.ఱ. ప్రసాద్, ఎస్ఐలు ఆంజనేయులు, సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాయి. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, వేలిముద్రల విశ్లేషణతో పోలీసులు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, అంజనీపురం, మండేపూడి ప్రాంతాల్లో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. అరెస్టైన నిందితుల వివరాలు: తమ్మిశెట్టి నాగరాజు (32) – లారీ డ్రైవర్, పిడుగురాళ్ల అల్లంశెట్టి సాయి కిరణ్ అలియాస్ పాండు (22) –లేబర్, అంజనీపురంసమంతపు వెంకట అశోక్ (33) పురోహిత్యం, అంజనీపురం ఆలేటి కోటేశ్వరరావు (22) – ఆటో డ్రైవర్, పిడుగురాళ్ల సపావత్ నాగ కిరణ్ బాబు నాయక్ (31) – ఆటో డ్రైవర్, మండేపూడి పిల్లి రాజేష్ (25) – బైక్ మెకానిక్, పల్నాడు జిల్లా పరారీలో ఉన్న వారు, గాడిబోయిన గోపి సాయి (22), తమ్మంద్ర రమేష్ (34) విచారణలో భూష్మి శ్రీకాంత్ యువకులను ప్రలోభపెట్టి చోరీల వైపు మళ్లించినట్లు వెల్లడైంది. తాళాలు పగులగొట్టడం, ఇళ్లను ఎంపిక చేసుకోవడం, సీసీ కెమెరాలను తప్పించుకోవడం వంటి విషయాల్లో వారికి శిక్షణ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా తెలంగాణలో 28, ఆంధ్రప్రదేశ్‌లో 12 కలిపి మొత్తం 40 చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి ఆభర ణాలు, రూ.1.50 లక్షల నగదు, రెండు టీవీలు, రెండు సౌండ్ బార్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 12 చోరీ ప్రదేశాల్లో లభించిన వేలిముద్రలు నిందితుల వేలిముద్రలతో సరిపో లినట్లు నిర్ధారణ అయింది. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ."ఎంత తెలివిగా నేరాలకు పాల్పడినా చట్టం నుంచి తప్పించుకోలేరు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి నేరస్థుడిని చట్టం ముందు నిలబెడతాం" అని తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## 3 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

– శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.



**లియాదాద్రి భువనగిరి, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామం నుండి యాపగాని తండా వరకు సుమారు రూ.3 కోట్ల వ్యయంతో చేపట్ట నున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శని వారం రోజు భువనగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాలతో పాటు తండాల సమగ్ర అభివృద్ధి కి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. తండాల ప్రజలకు మెరు గైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నాణ్యమైన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల మౌలిక సదు పాయాలు, ఉపాధి అవకాశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగు తుందన్నారు. ఉద్యోగాల పేరుతో ప్రజలను తప్పు దోవ పట్టించే రాజకీయా లకు ప్రజలు సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, మహిళా సంక్షేమ పథకాలు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి కార్య క్రమాలను వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి తండా అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీబీ నగర్ పిఏసిఎస చైర్మన్ పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల, గ్రామాల ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## కొమ్మిడి నర్సింహా రెడ్డి సేవలు చిరస్మరణీయం..

– త్వరలో కుమ్మరి నర్సింహారెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు.
– భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం రోజు ఏర్పాటు చేసిన భువనగిరి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ కొమ్మిడి నర్సింహా రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో భువనగిరి నియోజక వర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని నరసింహారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంతాప సభలో పాల్గొని వారి సేవలను స్మరించు కున్నారు. ఈ సందర్భంగా కొమ్మిడి నర్సింహా రెడ్డి స్మారక సంచికను స్థానిక ఎమ్మెల్యే ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా కుంభం అనిల్ మాట్లాడుతూ, స్వర్గీయ కొమ్మిడి నర్సింహా రెడ్డి ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకుడని కొని యాడారు. సుమారు 300 ఎకరా ల భూమిని ప్రజా ప్రయోజనాల కోసం దానం చేసిన మహోన్నత వ్యక్తి అయినప్పటికీ, ఆయనకు స్వంత ఇల్లు కూడా లేక పోవడం ఆయన త్యాగ నిరతికి నిదర్శనమని పేర్కొన్నారు. 2001 సంవ త్సరంలోనే పిల్లాయిపల్లి-బునాది కాలువ సర్వే పనుల కోసం స్వంత డబ్బులను వెచ్చించి అభివృద్ధికి బాటలు వేసిన దూరదృష్టి గల నాయకుడు కొమ్మిడి నర్సింహా రెడ్డి అని గుర్తు చేశారు. వారి సేవలకు గుర్తింపుగా బొల్లెపల్లి కాలువకు స్వర్గీయ కొమ్మిడి నర్సింహారెడ్డి పేరును పెట్టేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే భువనగిరి పట్టణ కేంద్రంలో స్వర్గీయ కొమ్మిడి నర్సింహా రెడ్డి గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసు కుంటామని ప్రకటించారు. ప్రజా సేవలో ఆయన చూపిన నిబద్ధత, త్యాగం, అభివృద్ధి పట్ల ఉన్న అంకితభావం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత, టెస్కాబ్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, భువనగిరి నియోజకవర్గ ప్రజా ప్రతి నిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అభిమానులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలి..

– స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావు.





**యాదాద్రి భువనగిరి, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు రక్షించ వచ్చు నని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు శనివారం రోజు కలెక్టరేట్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ వారిచే రక్తదాన శిబిరం జరిగింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయ డానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటుగా ఆపదలో ఉన్న వారిని ప్రాణాలను రక్షించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినంద నీయమని అన్నారు. రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యదర్శి, సీఈవో ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ అందులో సగం కూడా దాతలు నుంచి సేకరించ బడటం లేదన్నారు. రాష్ట్రంలో 8 బ్లడ్ బ్యాంకు లు ఉన్నాయని , 9వ బ్లడ్ బ్యాంకుగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో త్వరలోనే భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్ర రెడ్ క్రాస్ రెండు కోట్ల మేర ఎక్విప్మెంట్సు తమ కూర్చనిందని భవన నిర్మాణం కోసం దాత శ్రీధర్ రెడ్డి అయిదు కోట్ల మేర వితరణ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని వివరించారు రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ సూచనల మేరకు రాష్ట్రంలో లక్ష రెడ్ క్రాస్ సభ్యత్వం చేయాలన్న లక్ష్యంలో ఇప్పటివరకు 42 వేల సభ్యత్వాన్ని పూర్తి చేసినట్లు శ్రీరాములు వివరించారు. రెడ్ క్రాస్ లో సభ్యులుగా చేరి స్వచ్ఛంద సేవ చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛంద కార్యకర్తలు యువకులు ప్రజలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ఆదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడంలో యువత ముందుండాలని కోరారు ఈ సందర్భంగా హైదరాబాద్ విద్య నగర్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది 86 మంది రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డిఓ కృష్ణారెడ్డి, జెడ్పి సీఈవో శోభారాణి, చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, డి ఆర్ డి ఓ నాగిరెడ్డి, అదనపు పిడి సురేష్, డిహెచ్ఎంఓ మనోహర్, డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, పంచాయతీ రాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి శివ ప్రసాద్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. లక్ష్మీనరసింహారెడ్డి, స్టేట్ ఎంసీ మెంబర్ ఆర్ మహేందర్ రెడ్డి, డివిజన్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి, జిల్లా డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ, పి శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఎన్. చారి, టౌన్ అధ్యక్షుడు వై. పురుషోత్తం రెడ్డి, డివిజన్ ప్రతినిధులు రామ్ రెడ్డి, చంద్రశేఖర్, లావణ్య, కవిత, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినోలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి.
- తక్కువ నీటి సామర్థ్యం గల పంటల సాగును ప్రోత్సహించాలి.
- జిల్లాల వారిగా సూపర్ ఎల్‌నినో కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలి.
- సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.





**యాదాద్రి భువనగిరి, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** సూపర్ ఎల్‌నినో ప్రభావం తో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారు లకు సూచించారు. శని వారం రోజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధి కారులతో కలిసి సూపర్ ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వ్యవసాయ ప్రణాళికలు, తదితర అంశాల పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రైతులకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంటల మార్పిడి విధానాలను ప్రోత్సహించాలని, తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సూచనలు అందుబాటులో ఉంచి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లా ఇంఛార్జ్ మంత్రులు, ప్రత్యేక అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సూపర్ ఎల్‌నినో పరి స్థితులు, వర్షపాతం, వ్యవసాయం, తాగునీరు, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికల పై సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు మంజూరైన వాహనాలను పంపిణీ చేయండి



**నేలకొండపల్లి, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

జిల్లాలో దివ్యాంగులకు మంజూరైన స్కూటీలను వెంటనే వంజూరు చేయాలని టీడీజేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య కోరారు. దివ్యాంగుల మరియు వయోవృద్ధుల అధికారిణి ప్రమీల ను సంఘం ప్రతినిధులు శనివారం కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... పాలేరు నియోజకవర్గంలో దివ్యాంగులకు 23 స్కూటీలు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా... నేటికి పంపిణీ చేయలేదని వాపోయారు. జిల్లాలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల పోస్టుల ను వెంటనే భర్తీ చేయాలని కోరారు. జిల్లా దివ్యాంగుల వేల్ఫేర్ కమిటి డైరెక్టర్ లేక సమస్యలను చెప్పుకునే అవకాశం లేకుండా ఉందన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పై క్షేత్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తమ పట్ల సానుకూలంగా స్పందించిన జిల్లా అధికారిణి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నజీర్, కె.సురేష్, జిల్లపల్లి వెంకటేశ్వర్లు, ఇస్లావత్ రామారావు, మల్లేల రమాదేవి, బిందు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాల-గుడిపూడి



**ఖమ్మం, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని నెమలి పూరి తండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసు రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రతి నెల మూడవ శనివారం ఏర్పాటు చేసిన సందర్భంగా ఈ సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించబడుతుందని, అదేవిధంగా మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్ మొదలగు విద్యార్థులకు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల చేత ఆరు ముఖ్యమైన వాగ్దానాలను చేయించారు. ఒకటి ప్రతిరోజు పిల్లలను బడికి పంపించాలి, రెండు పిల్లలు బడికి రాకపోతే టీచర్స్ కు తెలపాలి, మూడు ప్రతిరోజు బడిలో ఏమి జరుగుతుందో పిల్లలను అడిగి తెలుసుకోవాలి, నాలుగు పిల్లలను ఇంటి దగ్గర చదివిస్తాము, అయదు బడిలో జరిగే ప్రతి పేటీఎం కు హాజరవుతాము, ఆరు ప్రతినెల ఒకసారి బడికి వెళ్లి పిల్లవాడి ప్రగతిని చర్చిస్తాను. అని అందరితో వాగ్దానం చేయించడం జరిగింది. ఈ సమావేశంలో ఏఏపిసి చైర్మన్ జి బుజ్జి ఉపాధ్యాయులు నునావత్ వెంకన్న, ఏ రాము తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఒకే కుటుంబంలో మెరిసిన నీట్ ఆణిముత్యాలు..



**కేశంపేట, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కమ్మరి రమేష్, కమ్మరి అనిత దంపతుల కుమార్తెలు కమ్మరి వైష్ణవి, కమ్మరి రక్షిత నీట్–2026 పరీక్షలో చెరో 514 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరీమణులు ఒకే మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది.వీరిద్దరూ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ వరకు చదివి తొలిసారి నీట్ పరీక్ష రాసినా ఆశించిన ఫలితం రాలేదు. అయితే నిరాశ చెందకుండా మరోసారి ప్రయత్నించాలనే పట్టుదలతో తల్లిదండ్రులను ఒప్పించారు. ఆర్థికంగా సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ, తమ కుమార్తెలు డాక్టర్లుగా ఎదగాలన్న లక్ష్యంతో తల్లిదండ్రులు అప్పులు చేసి హయత్‌నగర్‌లోని డాక్టర్స్ నీట్ అకాడమీలో కోచింగ్ ఇప్పించారు.తల్లిదండ్రుల త్యాగాన్ని వమ్ము చేయకుండా వైష్ణవి,రక్షిత ఎంతో కష్టపడి చదివి రెండో ప్రయత్నంలో చెరో 514 మార్కులు సాధించి కుటుంబంతో పాటు గ్రామానికి కూడా గర్వకారణంగా నిలిచారు. వారి విజయం కష్టపడితే లక్ష్యాన్ని తప్పకుండా చేరుకోవచ్చనే సందేశాన్ని యువతకు అందిస్తోంది.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, మిత్రులు, బంధువులు సోదరీమణులను అభినందిస్తూ వారి భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇప్పలపల్లి గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు కేశంపేట మండలానికి గర్వకారణంగా నిలిచింది.

# 18 నుండి 102కి చేరిన విద్యార్థుల సంఖ్య

## -సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు అభినందనలు

**నిజామాబాద్, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**



సిరికొండ మండలం హుస్సేన్ నగర్ గ్రామం గతంలో ఈ ప్రభుత్వ పాఠశాలలో కేవలం 18 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా.. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పాఠశాలలో వసతులు కల్పించి, ప్రభుత్వ బడి ప్రాముఖ్యతను వివరించడం ద్వారా ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి 102 మందికి చేరింది.ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, విద్యార్థుల సంఖ్య పెంపునకు అహర్నిశలు కృషి చేసిన స్థానిక సర్పంచ్ మల్లేష్, ఉపసర్పంచ్ రమేష్ మరియు వార్డు సభ్యులను ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం.. కొత్త పేరెంట్స్ కమిటీ ఎన్నిక పాఠశాలలో శనివారం నాడు విద్యార్థుల తల్లిదండ్రులతో ఒక ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి మరియు విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పాఠశాల నూతన పేరెంట్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా కమిటి సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకే పంపించాలని కోరారు. రాబోయే రోజుల్లో పాఠశాలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి గ్రామస్థులు, కమిటీ సభ్యులు మరియు ఉపాధ్యాయులు సమన్వయంతో సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, కొత్తగా ఎన్నికైన పేరెంట్స్ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో సర్వజ్ఞ స్కూల్ విద్యార్థికి కాంస్య పతకం

**ఖమ్మం, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఢిల్లీ ఎన్.సి.ఆర్ పరిధిలోని గ్రేటర్ నోయిడాలో గల గౌతమ్ బుద్ధ యూనివర్సిటీ వేదికగా ఈ నెల జూలై 12 నుండి 14 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన హెచ్.సి.ఎల్ ఫౌండేషన్ స్పోర్ట్స్ ఫర్ చేంజ్ నేషన్ ఫైనల్స్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో సర్వజ్ఞ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మన ప్రాంతానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు. ఈ జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో సర్వజ్ఞ పాఠశాల విద్యార్థి ఎస్.కె. సాహిల్ ఫజల్ అసాధారణమైన ఆటతీరుతో రాణించి టేబుల్ టెన్నిస్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. అదేవిధంగా, పాఠశాలకే చెందిన మరో విద్యార్థి ఇ. హరి జాతీయ స్థాయి పోటీల్లో చురుగ్గా పాల్గొని తన ప్రతిభను చాటుకుంటూ ప్రశంసా పత్రం అందుకున్నారు.జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను సర్వజ్ఞ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ కె. నీలిమ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, "మా విద్యార్థులు జాతీయ స్థాయి వేదికపై ప్రతిభ చాటి పతకాలు సాధించడం ఎంతో గర్వకారణం. కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించేలా సర్వజ్ఞ స్కూల్ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది. భవిష్యత్తులో ఈ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాము," అని తెలిపారు. డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల, క్రీడా శిక్షకుల కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. విజే




తలుగా నిలిచిన సాహిల్ ఫజల్, హరిలను ప్రిన్సిపాల్స్, పి.ఇ.టి, పాఠశాల అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు ఘనంగా అభినందించారు.

# వర్షాలు తక్కువ.. రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి





**ఖమ్మం, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలని, అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలని, అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి,జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. మండల పర్యటనలో భాగంగా మంత్రి, పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణా



లతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే 'రైతు భరోసా' అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు.ప్రజా ప్రభుత్వం పేదవారికి అండగా పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల జారీ చేశామన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు త్వరలో ఇస్తామని, మూడో, నాలుగో విడతల ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని, అర్హులైన ప్రతిఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని మంత్రి అన్నారు. రైతు భరోసా ఎకరాకు 6 వేలు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక వసతుల కల్పన చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, ఎంపిడివో సిలార్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడాలి




**మధిర,జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**

నేటి యువత చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడాలనీ మధిరలో యువజనోద్యమం ఏఐవైఎఫ్ కి పూర్వ వైభవం కోసం కృషి చేస్తాం అన్ని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బెజవాడ రవిబాబు పిలుపునిచ్చారు.ఆగస్టు 4వ తేదీన మధిర ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్ లో జరిగే ఏఐవైఎఫ్ మధిర రూరల్,పట్టణ మహాసభను జయప్రదం చేయలనీ ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల.రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధోజు శ్రావణ్ లు పిలుపునిచ్చారు. శనివారంస్థానిక మధిరలోనీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఏఐవైఎఫ్ మధిర రూరల్, పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు అయి వారి హక్కులను మర్చిపోతున్నారని, ఉద్యోగాల సాధనకై పోరాడాలని వారు అన్నారు.యువత చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడాలనీ మధిరలో యువజనోద్యమం ఏఐవైఎఫ్ కి పూర్వ వైభవం కోసం కృషి చేస్తాం అన్ని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బెజవాడ.రవిబాబు పిలుపునిచ్చారు.ఆగస్టు 4వ తేదీన మధిర ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్ లో జరిగే ఏఐవైఎఫ్ మధిర రూరల్,పట్టణ మహాసభను జయప్రదం చేయలనీ వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రహీమ్ గారు,ఏఐవైఎఫ్ మండల,పట్టణ నాయకులు సాయి,రాజేష్,నరేష్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దశదినకర్మకు హాజరైన బిఆర్ ఎస్ పార్టీ నాయకులు.

**చింతూరు,జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఏన్కూరు మండల పరిధి లోని భద్రతండ గ్రామానికి చెందిన బాదావత్ వస్త్రం. దశదిన కర్మకు హాజరైన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాదావత్ బాలాజీ, మాజీ జెడ్పిటిసి బాధావత్ బుజ్జి హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ధారావత్ కృష్ణ, జంకిలాల్, ధారావత్ బిక్కో, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు

## మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే ప్రాణాలే ప్రమాదంలో

### -డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండండి

**వనపర్తి,(జర్నలిస్ట్ ఫైల్):**







చిన్నంబావి మండలంలో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎస్సై రామన్ గౌడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారులపై వాహనాలను తనిఖీ చేస్తూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై వాహనదారులకు వివరించారు. మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన వారిపై, మాదకద్రవ్యాల బారిన పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, చిన్నంబావి మండల ఎస్సై రామను గౌడ్ సూచనలు చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమనీ ఎస్సై రామన్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు రాంబాబు, పార్వతి, అశోక్ పాల్గొని వాహనదారులకు అవగాహన కల్పించారు.

## వైరా ఆయకట్టు వరి రైతులకు సాగునీరు అందించాలి -బి ఆర్ ఎస్ డిమాండ్



**వైరా (జర్నలిస్ట్ ఫైల్) :** వైరా ఆయకట్టు వరి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని వైరా ఆయకట్టు పరిధిలోని అధిక శాతం రైతులు వరి పంటకే ప్రాధాన్యత ఇస్తారని వైరా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో బి ఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని జిల్లా బీఆర్ఎస్ నాయకులు కట్ట కృష్ణార్జునరావ్, బాణాల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ పరిధిలో సుమారు 17 500 హెక్టార్ల సాగు భూమిలో రైతులు వరి పంటకే ప్రాధాన్యత ఇస్తారని, వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ వరి సాగుకు సాగునీరు అందిస్తామని సాగునీటిని విడుదల చేసినప్పటికీ అధికారులు సాగునీరు అందించలేమని ఆరుతడి పంటలు వేసుకోవాలని గ్రామాల్లో గ్రామసభల ద్వారా తెలపటం ఎంతవరకు సభవని అన్నారు. గోదావరి జలాల ద్వారా వైరా రిజర్వాయర్ ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేసిన తర్వాత ఎల్.విలో ప్రభావం వలన ఆరుతడి పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించడం బాధాకరమన్నారు. ఎల్లీనో ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నప్పటికీ వైరా రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 15.5 అడుగులు ఉందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ శాసనసభ్యులు బానోతు మదన్లాల్ 12 అడుగుల నీటిమట్టం ఉన్న ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత అధికారులు సాగునీరు, వరి సాగుకు నీరు అందించలేమని ఆరుతడి పంటలను పండించడానికి సిద్ధం కావాలని కోరటం ఈ ప్రాంత రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. తక్షణమే వరికి సాగు నిర్వహించి వైరా ఆయకట్టు పరిధిలోని రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తీసుకువెళ్లి పంటలను సాగు చేస్తుంటే వైరా రిజర్వాయర్ కు గోదావరి జలాలు వచ్చినప్పటికీ సాగునీరు అందించలేమని చెప్పటం హాస్యాస్పదమని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ చిలక చిన్న కోటయ్య, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కారుకొండ బోస్ వేముల శివకృష్ణ వైరా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు మామిడి తోట పెంపకం పై అవగాహన

### -ముఖ్య అతిథి డిహెచ్ఎస్ఓ సురేష్ ఏడిహెచ్ ఓ అరుణ.

**యాచారం,జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :** యాచారం మండలంలో శుక్రవారం తెలంగాణ అగ్రికల్చర్ ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ మామిడి తోటలో మామిడి రైతులకు మామిడి తోటలో చేయవలసిన పునరుద్ధరణ దాని యొక్క లాభాలు వంటి అంశాల మీద రైతులకు అవగాహన కల్పించారు.అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డి.హెచ్.ఎస్.ఓ సురేష్ అలాగే ఏ.డి.హెచ్ అరుణ,ఉద్యాన శాఖ అధికారి నవీన పాల్గొన్నారు.మామిడిలో కొమ్మల కత్తిరింపులో మెలకువలు పాటించండి తెగులు, పురుగులు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి ఉద్యానవన అధికారుల సూచనలు సలహాలు పాటించండిమామిడి తోటలో రైతు అప్రమత్తంగా ఉంటూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు మామిడి తోటలో కాయలకోట పూర్తయిన వెంటనే అధికారుల సూచనలు సలహాలు మేరకు కొమ్మలు కత్తిరింపు ప్రక్రియను చేపట్టాలని సూచిస్తున్నారు.మామిడి చెట్లలో ఎండు పుల్ల, తెగుళ్లు, చెట్టు బెరడు ఎండిపోవడం, గుబురుగా ఉండటం వలన దిగుబడి తగ్గుతుంది ఇటువంటి మామిడి తోటలు మరల అధిక దిగుబడి ఇచ్చే విధంగా చేయు ప్రక్రియనే మామిడి తోటల పునరుద్ధరణ అంటారు.జూలై – సెప్టెంబర్ మధ్యలో చెట్ల కత్తిరింపు భూమట్టానికి 2–4 మీటర్ల ఎత్తులో చేయాలి మొదట చెట్టు ఆకృతి గొడుగుల వచ్చేటట్లు ప్రణాళిక చేసుకోవాలి. చెట్టు మొదల నుండి నాలుగు దిశలలో ఉన్న పెద్ద కొమ్మలను 75 సెంటీమీటర్ల పొడవు నుంచి మిగిలిన భాగాన్ని కత్తిరించాలి. చిన్న కొమ్మలైతే వాటి చివర భాగాన్ని 1.5–2 మీటర్ల పొడవు కత్తిరించాలి.కత్తిరించిన కొమ్మలకు బోర్డో మిశ్రమము పూయాలి కత్తిరింపు చేసిన చెట్లకు 3 గ్రాముల కాపరాక్సి క్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.పునరుద్ధరణ చేసిన



చెట్లకు 2 కిలోల యూరియా, 5 కిలోల సూపర్ ఫాస్ట్ ఫైట్ మరియు 1.5n కిలోల పొటాష్ ఎరువులను రెండు సమభాగాలుగా చేసి 150 కిలోల కంపోస్ట్ ఎరువుతో పాటు ఒక భాగాన్ని సెప్టెంబర్ మాసంలో మరొక భాగాన్ని జనవరి మాసంలో వేసుకోవాలి.మార్చ్, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో చిగుళ్ళు బాగా ఆరోగ్యంగా పెరగడానికి 15 నుంచి 20 రోజులకు ఒకసారి నీటి తడలోనివ్వాలిపునరుద్ధరణ చేసిన చెట్లనుండి కొత్తగా తొడిగిన రెమ్మలు, కొమ్మలు కాపు రావడానికి రెండేళ్లు పడుతుంది. కాబట్టి తోటలో వరుస మార్చ వరుసలోని చెట్లను కత్తిరించడం వల్ల రైతుకు తోటల నుంచి కొంత ఆదాయం వస్తుంది అంతే కాకుండా చెట్లను కత్తిరించిన 2 సంవత్సరాల వరకు అంతర పంటలుగా కూరగాయలను సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందుకోవచ్చు.పునరుద్ధరణ చేసిన చెట్లలో రెండు సంవత్సరాల తర్వాత క్రమంగా దిగుబడి పెరుగుతుంది.పునరుద్ధరణ చేసిన మామిడి తోటలకు ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఒక హెక్టార్కు 24 వేల రూపాయలు రైతుకు సబ్సిడీ రూపకంగా అందిస్తున్నారు.

## ఎమ్మెల్యే,కృషితో చౌదరిపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం -కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**తలకొండపల్లి, జూలై 19 (జర్నలిస్ట్ ఫైల్) :**



తలకొండపల్లి మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ మెరిగే. భారతమ్మ గోపాల్,ఉప సర్పంచ్, తడిసిన జ్యోతీ ప్రదీప్ రెడ్డి, అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తనను ఆదరించి అభిమానించి గెలిపించినందుకు మీ రుణాన్ని అభివృద్ధి పనులతో తీర్చుకుంటానని ఆయన పేర్కొన్నారు.చౌదర్‌పల్లికి 12 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 11 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు.నియోజకవర్గంలోని ఎక్కడ ఏ గ్రామంలో పర్యటిస్తున్న ప్రతిచోటా మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు ఇల్లు కావాలని పెద్ద ఎత్తున కోరుతున్నారని,అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.ఇప్పటికే తొలి విడత పూర్తైందని, ప్రస్తుతం రెండో విడత కొనసాగుతోందని, వచ్చే ఏడాది మూడో విడత కూడా అమలు చేస్తామని వెల్లడించారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉండి డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఎమ్మెల్యే బిఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు.అధికారులు పార్టీలకతీతంగా అర్హులను గుర్తించి ఇండ్లు మంజూరులో పారదర్శకంగా వ్యవహరించాలని ఎంపీడీవోకు సూచించారు. గ్రామాల్లో ఇంకా రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కోసం ప్రజలు ఎదురుచూడాల్సి రావడం బాధాకరమన్నారు.గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని,భవిష్యత్తులో చేయి చాచే పరిస్థితి రాకుండా విద్యే ఆయుధమని సూచించారు. యువత మద్యం,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.తలకొండపల్లి మండలంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తున్నామని, వెల్జాల్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మంజూరు చేయడం జరిగిందని,అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గత ప్రభుత్వం కులాల పేరుతో విద్యార్థులను విభజించిందని విమర్శించారు.నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశామని, ప్రజలకు రేషన్ కార్డులు,సన్నబియ్యం, ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.నియోజకవర్గంలోని ఏ ఒక్కరు కూడా నాకు సిసి రోడ్లు కావాలని అడగడానికి వినతి పత్రాలు ఇవ్వకుండా చేస్తానని సభాముఖంగా ఎమ్మెల్యే మరో అడుగు ముందుకేసి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం పి డీ ఓ సీతారావమ్మ, ఏ పి ఓ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ యాటా గీతా నరసింహ, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి,సర్పంచులు రామలక్ష్మణ్,రమేష్,మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, జైపాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు యాదయ్య, రమేష్, అంబాజీ,ఏఎంసీ డైరెక్టర్లు అంజయ్య గుప్తా,వెంకట్ రెడ్డి,శ్యాంసుందర్ రెడ్డి,నాయకులు భగవాన్ రెడ్డి,రఘు రాములు,నరసింహారెడ్డి,రేణు రెడ్డి, ప్రదీప్ రెడ్డి, రవీంద్ర నాయక్,శ్రీశైలం,పవన్ వాల్మీకి, కాకి కృష్ణ,అజీజ్,చెన్నకేశవులు, హరీష్, రఘుపతి రెడ్డి, జ్యోతి, వార్డు సభ్యులు, శేఖర్, మల్లమ్మ, సుమతమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, మహేష్,శివలక్ష్మి , గణేష్,గ్రామ పెద్దలు మహిళలు,వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు షైనింగ్ స్టార్స్ కార్యక్రమం



○ పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభావంతులకు "షైనింగ్ స్టార్స్ - 2026" గౌరవ సత్కారం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ఈ ఏడాది పదవ తరగతి, ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులను అభినందిస్తూ "షైనింగ్ స్టార్స్ - 2026" కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు విద్యా శాఖ అధికారులతో ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు పొన్నూరు రహదారిలో గల బి కన్వెన్షన్ లో ప్రారంభం అవుతుందని చెప్పారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని అన్నారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. తాగునీరు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం పాటించాలని అన్నారు. అందరూ కూర్చునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. విద్యార్థులను ఆశీర్వదించి సత్కార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలి



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 71 షెడ్యూల్డ్ పరిశ్రమలు, 66 రంగాల్లో పనిచేస్తున్న సుమారు 50 లక్షల మంది కార్మికుల కనీస వేతనాలను వెంటనే రూ. 26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నిర్వహించనున్న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం వినుకొండలోని సీఐటీయూ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు, సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, 108, 104, ఆరోగ్య మిత్ర, అర్బన్ హెల్త్, ఆయుష్, తల్లి-బిడ్డ తదితర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని, అవుట్‌సోర్సింగ్, ఏపీకాస్, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, వివిధ పథకాల కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 30న నిర్వహించే ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే. హనుమంత్ రెడ్డి, ఆరోగ్య మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, ఆటో యూనియన్ నాయకులు కరీముల్లా, బెన్నీ, తిరుమల లక్ష్మి, రంజాన్ బి, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## 21,22 తేదీల్లో పెన్షన్ అండ్ జిపిఎఫ్ అదాలత్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో పెన్షన్ అండ్ జిపిఎఫ్ అదాలత్ ను జూలై 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏ&ఈ) ఎస్. శాంతి ప్రియ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ & ఎంటైటిల్‌మెంట్స్) కార్యాలయం గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలో గల శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పెన్షన్, జీపీఎఫ్, పదవీ విరమణ సేవలకు సంబంధించిన ఇతర అంశాలలో తక్షణ మార్గదర్శకత్వం, ఫిర్యాదుల పరిష్కారం, మద్దతును అందించడం ద్వారా పెన్షన్, జీపీఎఫ్ సేవలను సరళతరం చేయడమే పౌర కేంద్రీకృత కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ప్రభుత్వ శాఖలతో మెరుగైన సమన్వయం, డిజిటల్ గవర్నెన్స్ కార్యక్రమాల ద్వారా పదవీ విరమణ ప్రయోజనాలను సకాలంలో అందించుటకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏ&ఈ)తో పాటు సీనియర్ అధికారులు పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (డీడీవోలు), పెన్షన్ శాంక్షనింగ్ అథారిటీలు (పీఎస్ఏలు) తో నేరుగా మాట్లాడి పెన్షన్, జీపీఎఫ్‌కు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

**గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు**

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఈ అదాలత్ ను నిర్వహిస్తున్నామని, సంబంధిత జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, డీడీవోలు, పీఎస్ఏలు ఈ కార్యక్రమంలో పాల్గొని వేగవంతమైన, పారదర్శకమైన, ఇబ్బందులు లేని పదవీ విరమణ సేవలను పొందాలని విజ్ఞప్తి చేశారు.

## టెట్‌పై చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి: ఏపీ వైఎస్ఆర్‌టీఏ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) అమలుకు ముందే చట్టబద్ధంగా నియమితులైన ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీవైఎస్ఆర్‌టీఏ) డిమాండ్ చేసింది. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సోమవారం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. టెట్ అమలుకు ముందు అప్పటి నియామక నిబంధనల ప్రకారం ఉద్యోగాల్లో చేరి ఎన్నో ఏళ్లుగా విద్యా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో తగిన చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రంతో చర్చించి చట్ట సవరణకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. రాష్ట్ర, జిల్లా, మండల, యూనిట్ స్థాయి సంఘ నాయకులు, సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి జిల్లా కేంద్రంలో క్రమశిక్షణతో, ప్రజాస్వామ్య పద్ధతిలో జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సంఘ ఐక్యతను చాటాలని ఏపీ వైఎస్ఆర్‌టీఏ విజ్ఞప్తి చేసింది.

## సమాజ సేవలో రోటరీ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే నసీర్

○ ఘనంగా రోటరీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

○ ఇద్దరు చిన్నారులకు రోటరీ క్లబ్ ఆర్థిక సాయం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజలో ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం ఏఎస్ కన్వెన్షన్ లో రోటరీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ చైర్మన్ గా గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సమాజంలో పేద ప్రజలకు అండగా నిలిచేందుకు రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తుందని చెప్పారు. పేదలకు ఏ కష్టం వచ్చినా, ప్రకృతి వైపరీత్యాలు వెంటాడినా రోటరీ క్లబ్ సాయం చేస్తుందని అన్నారు. కేవలం సామాజిక బాధ్యత కాకుండా విద్య, వైద్య రంగాలలో రోటరీ క్లబ్ సేవలు అందిస్తోందని చెప్పారు.

ఈ సందర్భంగా రాజుపాలెం మండలానికి చెందిన తల్లిదండ్రులు లేని ఇద్దరు చిన్నారులకు రోటరీ క్లబ్ సమకూర్చిన రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే నసీర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రస్తుతం మూడో తరగతి, ఎల్కేజీ చదువుతున్న చిన్నారులకు పదో తరగతి వరకు రోటరీ క్లబ్ సాయం అందిస్తుందని నూతన చైర్మన్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. చిన్నారులకు ఏ అవసరం వచ్చినా తాను కూడా తోడుగా నిలబడతానని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు.

## పి.జి.ఆర్.ఎస్‌పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత, జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని సూచించారు.

క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు.

అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

## వివిఐటియూలో "టెలికాం ఆవిష్కరణలు మరియు ఏఐ వినియోగం"



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ నందు సిఎస్ఎమ్ మరియు సిఎస్ఈ విభాగాల ఆధ్వర్యంలో "టెలికాం రంగంలో అవకాశాలు, భవిష్యత్తు ఆవిష్కరణలు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై ఉన్న అపోహలు" అనే అంశంపై ఒక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ అంతర్జాతీయ టెలికాం సంస్థ 'నోకియా' రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కిషోర్ ఉన్నం హాజరయ్యారు. టెలికాం రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వల్ల కలిగే అవకాశాలతో పాటు, దానిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ భవిష్యత్తు ఆవిష్కరణలను ఎలా రూపొందించాలో ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కిషోర్ ఉన్నం మాట్లాడుతూ.. ఏఐ (ఎఐ ) అనేది వ్యవస్థను మెరుగుపరచడానికి, వేగవంతం చేయడానికి ఉపయోగపడే ఒక సాధనమే కానీ, అది మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. టెలికాం రంగంలో ఏఐ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఇది నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను ముందుగానే ఊహించి సిగ్నల్స్‌ను సర్దుబాటు చేస్తుందని, అలాగే స్మార్ట్ చాట్‌బాట్‌ల ద్వారా కస్టమర్ల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో 5జి మరియు 6జి నెట్‌వర్క్‌లు పూర్తిగా ఏఐ ఆధారితంగానే పనిచేస్తాయని ఆయన తెలిపారు. కాబట్టి, ఏఐ ద్వారా టెలికాం రంగంలో రాబోయే సరికొత్త అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, మారుతున్న ఆవిష్కరణలకు తగ్గట్టుగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి. రామచంద్రన్ భట్టాచార్య, సిఎస్ఎమ్ విభాగాధిపతి డాక్టర్ జి. సంజయ్ గాంధీ, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొన్ని రోజుల పాటు నీటిని కాచి తాగాలి : కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** కృష్ణానదిలోకి గోదావరి జలాలు చేరుతున్న నేపథ్యంలో తాగునీటిలో బురద శాతం (టర్బిడిటీ) పెరిగే అవకాశం ఉన్నందున నగర ప్రజలు కొన్ని రోజుల పాటు తాగునీటిని తప్పనిసరిగా బాగా కాచి, చల్లార్చిన తర్వాతే వినియోగించాలని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

నీటి శుద్ధి ప్రక్రియలో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఆలం వినియోగించడంతో పాటు, సరఫరా సమయంలో తగిన మోతాదులో క్లోరినేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ఓవర్‌హెడ్ రిజర్వాయర్లను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం శుభ్రపరచి, వాటి వివరాలను సంబంధిత ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు.

ఇప్పటికే గుర్తించిన 1,437 డ్రెయిన్ క్రాసింగ్ పైప్‌లైన్లను సురక్షిత ప్రాంతాలకు మార్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో రోజుకు కనీసం పది నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని, పంపింగ్ కేంద్రం నుంచి వినియోగదారుల ఇళ్ల వరకు తాగునీటి సరఫరాలో క్లోరిన్ మోతాదును నిరంతరం పరీక్షించాలని ఆదేశించారు. ఇందుకోసం అమెనిటీ కార్యదర్శులు క్లోరిన్ శాంపిల్స్ సేకరించనుండగా, పరీక్షల ఫలితాలను ఏఈలు, డీఈఈలు పర్యవేక్షిస్తూ ఏపీసీఎంఎంఎస్ఎస్ యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. నగరంలో ఎక్కడైనా కలుషిత నీటి సరఫరా జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 0863-2345103కు సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాగునీటి సరఫరా ప్రజారోగ్యానికి నేరుగా సంబంధం ఉన్న అంశమని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఈ-సమన్స్, ఈ-ప్రాసిక్యూషన్ అమలుపై కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ఈ-సమన్స్, ఈ-ప్రాసిక్యూషన్, ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్) వ్యవస్థలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు కోర్టు విధుల నిర్వహణలో మరింత సమన్వయం పెంచాలని జిల్లా పోలీసు అధికారులు సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో డీసీఆర్‌బీ సీఐ ధర్మేంద్ర ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో సమన్వయకర్తలుగా విధులు నిర్వహిస్తున్న డెడికేటెడ్ కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో ఈ-సమన్స్, ఈ-ప్రాసిక్యూషన్, ఐసీజేఎస్ వ్యవస్థల అమలు, కేసుల పురోగతి, కోర్టు విధుల నిర్వహణలో అనుసరించాల్సిన విధివిధానాలపై సమగ్రంగా సమీక్షించారు. న్యాయ వ్యవస్థలో సాంకేతికత వినియోగంతో కేసుల విచారణ వేగవంతమవడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ-సమన్స్‌లను సంబంధిత వ్యక్తులకు సకాలంలో అందజేసి, వాటి అమలు వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఈ-ప్రాసిక్యూషన్ వ్యవస్థలో చార్జిషీట్లు, సాక్ష్యాలు, ఇతర అవసరమైన పత్రాలను పూర్తిస్థాయిలో అప్‌లోడ్ చేసి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐసీజేఎస్‌లో నమోదయ్యే వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయడం ద్వారా పోలీసు, కోర్టులు, ఇతర న్యాయ వ్యవస్థల మధ్య సమాచార మార్పిడి మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు.

డెడికేటెడ్ కోర్టు కానిస్టేబుళ్లు ప్రతిరోజూ కోర్టు కేసుల పురోగతిని పరిశీలించడం, సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా సమన్వయం చేయడం, నిందితులను భద్రతతో కోర్టుకు తరలించడం, వారెంట్లు, సమన్ల అమలు, కోర్టు ఆదేశాలను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు చేరవేయడం వంటి బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు.

కోర్టు కేసుల రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించడం, పెండింగ్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించడం, దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులు, కోర్టు అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగించాలని ఎస్పీ ఆదేశాలను సమావేశంలో తెలియజేశారు. ప్రజల్లో న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెరిగేలా సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డెడికేటెడ్ కోర్టు కానిస్టేబుళ్లకు సూచించారు. సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ ప్రభాకర్, ప్రాసిక్యూషన్ విభాగం అధికారులు, జిల్లా డెడికేటెడ్ కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## నేరాలకు దూరంగా ఉండాలి.. రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు మరింత వేగవంతం చేసిన గుంటూరు పోలీసులు రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

కౌన్సిలింగ్ సందర్భంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని పోలీసులు సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎంఈఓ-1ల సమస్యలు పరిష్కరించాలి

○ విద్యాశాఖ డైరెక్టర్‌కు ఎంఈఓ-1 అసోసియేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విద్యాశాఖలో పనిచేస్తున్న మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓ-1) ఎదుర్కొంటున్న పరిపాలనా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఎంఈఓ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 89 ద్వారా ఎంఈఓ-1, ఎంఈఓ-2లకు స్పష్టమైన విధుల చార్ట్ (జాబ్ చార్ట్)ను నిర్దేశించినప్పటికీ, పలు జిల్లాల్లో ఆ నిబంధనలను పాటించడం లేదన్నారు. జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా అన్ని రకాల బాధ్యతలను ఎంఈఓ-1లకే అప్పగిస్తున్నారని, విద్యాశాఖ సమీక్ష సమావేశాల్లో కూడా జాబ్ చార్ట్‌లో లేని అంశాలపై వారినే బాధ్యులను చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎంఈఓ-1లకు ఇప్పటికీ సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించకపోవడం వల్ల పరిపాలనా వ్యవహారాల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంఈఓ-1లకు వాహన సౌకర్యం లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణకు ఆటంకాలు కలుగుతున్నాయని చెప్పారు. జీవో నిబంధనలకు అనుగుణంగా ఎంఈఓ-1ల విధులను పరిమితం చేయడంతో పాటు, సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ మంజూరు చేయాలని, పాఠశాలల తనిఖీలు, పర్యవేక్షణ సమర్థవంతంగా నిర్వహించేందుకు వాహన సౌకర్యం కల్పించాలని తమ లేఖలో కోరినట్లు సామల సింహాచలం తెలిపారు. ఎంఈఓ-1ల సమస్యల పరిష్కారానికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల సంతకాల సేకరణ

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా రవాణా సేవలను విస్తరించాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ రెండో దశ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఈ నెల 27న నిర్వహించే గ్రీవెన్స్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాలను జిల్లా కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేసి ఆర్టీసీ పరిరక్షణకు సంబంధించిన ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని, స్త్రీశక్తి పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పెద్ద ఎత్తున కొత్త బస్సులను వెంటనే ప్రవేశపెట్టాలని జేఏసీ డిమాండ్ చేసింది. అలాగే ఆర్టీసీలో ఖాళీగా ఉన్న సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసి డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్, సూపర్‌వైజరీ తదితర విభాగాల్లో సిబ్బంది కొరతను నివారించాలని, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన నిధులు సమకూర్చాలని కోరింది. ప్రజా ప్రయోజనాల పరిరక్షణతో పాటు ఆర్టీసీని మరింత సమర్థవంతమైన సంస్థగా తీర్చిదిద్దడమే ఉద్యమ లక్ష్యమని పేర్కొంటూ, మూడో దశ ఉద్యమ కార్యాచరణను ఈ నెల 30న విజయవాడలో ప్రకటిస్తామని జేఏసీ వెల్లడించింది. రాష్ట్రంలోని ఆర్టీసీ ఉద్యోగులందరూ సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని జేఏసీ కో-చైర్మన్లు పిలుపునిచ్చారు.

## ఈ రాత్రితో ఏఈఈ దరఖాస్తుల గడువు ముగింపు

○ అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సూచన

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారం (జూలై 20) రాత్రి 11:59 గంటలతో ముగియనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా గడువు ముగిసేలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక నోటిఫికేషన్‌లో పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి నిర్ణీత గడువులోపు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని అభ్యర్థులకు సూచించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# బోధన వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపుపై రగడ... కమిటీ ఏర్పాటు

## ప్రభుత్వ వైద్యులు-జూనియర్ డాక్టర్లతో 12 మంది నిపుణుల కమిటీ

## రెండు నెలల్లో సమగ్ర నివేదిక.. అప్పటి వరకు నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి

## 17 అంశాలపై అధ్యయనం.. అన్ని క్యాడర్ల బోధన వైద్యుల అభిప్రాయ సేకరణకు శ్రీకారం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో బోధన వైద్యుల పదవీ విరమణ వయస్సును 63 నుంచి 65 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదన మరోసారి తెరపైకి రావడంతో వైద్య విద్యా శాఖలో తీవ్ర చర్చ ప్రారంభమైంది. ఇప్పటికే ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖ, ముఖ్యమంత్రి కార్యాలయం రెండుసార్లు తిరస్కరించినప్పటికీ, తాజాగా మరోసారి ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం వెలువడడంతో ప్రభుత్వ బోధన వైద్యులు, జూనియర్ డాక్టర్లలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్యుల సంఘం, జూనియర్ డాక్టర్ల సంఘం సంయుక్తంగా 12 మంది నిపుణులతో ప్రత్యేక అధ్యయన కమిటీని ఆదివారం ఏర్పాటు చేసింది.

ఈ కమిటీ బోధన వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపు వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు, ప్రత్యామ్నాయ మార్గాలు, బోధన వైద్యులు మరియు జూనియర్ డాక్టర్ల అభిప్రాయాలు, గతంలో వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లుగా పనిచేసిన వారి సూచనలు, పరిపాలనా పరమైన ప్రభావం వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి రెండు నెలల్లో నివేదికను రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ, ముఖ్యమంత్రి కార్యాలయం, ఆర్థిక శాఖ, న్యాయ శాఖ, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లకు సమర్పించనుంది.

**మూడోసారి ప్రయత్నాలపై తీవ్ర అభ్యంతరాలు :** ప్రభుత్వ బోధన వైద్యుల వర్గాల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయం ప్రకారం, ఇప్పటికే పదవీ విరమణ వయస్సును 58 నుంచి 63 సంవత్సరాలకు పెంచిన తర్వాత మరోసారి వయస్సు పెంపునకు ప్రయత్నించడం సమంజసం కాదని అంటున్నారు. ముఖ్యంగా కొందరు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హోదాలో కొనసాగాలనే వ్యక్తిగత పదవీ ఆకాంక్షలే ఈ ప్రతిపాదన వెనుక ఉన్నాయనే అభిప్రాయం వైద్యుల్లో వ్యక్తమవుతోంది.

సీనియర్ ప్రొఫెసర్లు తాము ఇంక పనిచేయలేమంటూ తమ సేవా కాలం పొడిగింపుపై వ్యతిరేకత వ్యక్తం చేస్తుండగా, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ పదోన్నతులు పూర్తిగా నిలిచిపోతాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జూనియర్ డాక్టర్లు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో భవిష్యత్తులో తమ ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు.

**12 మంది నిపుణులతో కమిటీ :** ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో వైద్య విద్యలో అనుభవం కలిగిన 12 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సీనియర్ ప్రొఫెసర్లతో పాటు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. అన్ని క్యాడర్లకు ప్రాతినిధ్యం కల్పిస్తూ కమిటీని రూపొందించారు.

**రెండు నెలల గడువు.. ప్రతి బోధన వైద్యుడి అభిప్రాయం తప్పనిసరి :** కమిటీ సభ్యులను ఉద్దేశించి ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకుడు డాక్టర్ జయధీర్ మాట్లాడుతూ, కమిటీకి రెండు నెలల గడువు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కాలంలో రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ వైద్య కళాశాలలోని ప్రతి ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా సేకరించాలని సూచించారు.

పదవీ విరమణ వయస్సు పెంపుకు వారు అనుకూలమా, వ్యతిరేకమా? అయితే ఎందుకు? వ్యతిరేకమైతే కారణాలేమిటి? ప్రత్యామ్నాయ సూచనలేమిటి? వంటి అంశాలపై కళాశాలల వారీగా, క్యాడర్ల వారీగా నివేదిక సిద్ధం చేయాలని నిర్ణయించారు.

**తెలంగాణతో పోలిక సరైంది కాదన్న వైద్యులు :** సమావేశంలో తెలంగాణలో పదవీ విరమణ వయస్సు పెంపు ఉదాహరణ ప్రస్తావనకు వచ్చింది. అయితే పలువురు వైద్యులు తెలంగాణ పరిస్థితులను ఆంధ్రప్రదేశ్‌తో పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో అనేక సంవత్సరాలపాటు బోధన వైద్యుల నియామకాలు లేకపోయిన సమయంలో ఒకేసారి 25కు పైగా ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభించారని, అందువల్ల అక్కడి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పదోన్నతుల కోసం పెద్ద సంఖ్యలో ఎదురుచూస్తున్నందున ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నమని పేర్కొన్నారు.

**అసలు వయస్సు పెంపు తాపత్రయం ఎవరికి? :** పదవీ విరమణ వయస్సు పెంపును నిజంగా కోరేది ఎవరు? బోధన బాధ్యతలు నిర్వహిస్తున్న వైద్యుల అభిప్రాయం ఏమిటి? అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హోదాలో ఉన్న అధికారులకు మాత్రమే ఈ నిర్ణయం ప్రయోజనం చేకూరుస్తుందా? అధిక వయస్సులో వారు ఏడీఎంఈగా పరిపాలనా బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరా? వంటి అంశాలపై కూడా అన్ని క్యాడర్ల నుంచి అభిప్రాయాలు సేకరించాలని కమిటీ నిర్ణయించింది. వన్ టైం పదోన్నతులు చేపట్టకుండా పదవీ విరమణ వయస్సును పెంచితే ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల పోస్టులు ఏ విధంగా భర్తీ అవుతాయో స్పష్టత రావల్సి ఉందని అన్నారు.

**ప్రొఫెసర్ల కొరతపై పూర్తి వివరాలు బహిరంగపరచాలని డిమాండ్ :** పదవీ విరమణ వయస్సు పెంచకపోతే పీజీ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని రహస్య అజెండాతో తప్పుదోవ పట్టించే ప్రచారం అధికారులు చేస్తున్ననేపథ్యంలో, కాలేజీ, విభాగాల వారిగా ఖాళీ పోస్టులు, ప్రతి ప్రొఫెసర్ పోస్టుకు పదోన్నతికి విభాగాల వారిగా అర్హులైన అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిష్పత్తి సంఖ్య, కళాశాలల వారీగా పోస్టుల వివరాలను డీఎంఈ వెబ్‌సైట్‌లో బహిరంగంగా ప్రకటించాలని వైద్యులు కోరుతున్నారు.

**ప్రతి ఏడాది ఎంతమంది పదవీ విరమణ? :** ప్రతి సంవత్సరం సగటున సుమారు 50 మంది మాత్రమే పదవీ విరమణ చేస్తున్నారని, అదే సమయంలో పదోన్నతులకు అర్హులైన వారి సంఖ్య ఎంత ఉందో విభాగాల వారిగా శాస్త్రీయంగా విశ్లేషించాలని కమిటీ నిర్ణయించింది.

**ప్రత్యామ్నాయం - కాంట్రాక్టు ప్రొఫెసర్ల నియామకం? :** పదవీ విరమణ వయస్సు పెంపుకు బదులుగా అవసరమైన ప్రొఫెసర్ పోస్టులను తాత్కాలికంగా కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తే పీజీ సీట్ల సమస్య పరిష్కారమవుతుందా అనే అంశంపై కూడా అధ్యయనం చేయనున్నారు. కాంట్రాక్టు ప్రొఫెసర్లుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న వైద్యులను గుర్తించి నివేదికలో పొందుపరచాలని నిర్ణయించారు.

**స్వచ్ఛంద పదవీ విరమణలు ఎందుకు పెరుగుతున్నాయి? :** ఇటీవలి కాలంలో ప్రొఫెసర్లు స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవడం లేదా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు మధ్యలోనే సేవలు వీడడం ఎందుకు పెరుగుతోంది? పదవీ విరమణ వయస్సు పెంచితే ఇంకా ఎంతమంది ఉద్యోగాలను వీడే అవకాశం ఉంది? వంటి అంశాలపై కూడా కళాశాలల వారీగా అభిప్రాయాలు సేకరించనున్నారు.

**లేటరల్ ఎంట్రీ, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌పై ప్రభావం :** పదవీ విరమణ వయస్సు పెరగడం వల్ల పదోన్నతులు నిలిచిపోతే, భవిష్యత్తులో లేటరల్ ఎంట్రీ, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించనుంది.

**17 అంశాలపై సమగ్ర అధ్యయనం :** కాంట్రాక్టు పద్ధతిలో తాత్కాలికంగా ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ , పదవీ విరమణ వయస్సు పెంపు వల్ల వైద్య విద్య, పరిపాలన, బోధన నాణ్యత, పదోన్నతులు, ఉద్యోగ అవకాశాలు, పీజీ సీట్లు, పరిపాలనా సామర్థ్యం, ఆర్థిక ప్రభావం తదితర అంశాలపై మొత్తం 17 అంశాలను అజెండాగా రూపొందించి సమగ్ర అధ్యయనం చేపట్టాలని కమిటీ నిర్ణయించింది.

**నివేదిక వచ్చే వరకు ప్రభుత్వం సంయమనం పాటించాలని విజ్ఞప్తి :** కమిటీ నివేదిక సమర్పించే వరకు బోధన వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపుపై ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వాన్ని వైద్యులు కోరుతున్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

పనిచేస్తున్న బోధన వైద్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా వారి పదవీ విరమణ వయస్సుపై నిర్ణయం తీసుకోవడం సహేతుకం కాదని ప్రభుత్వ వైద్యుల సంఘం, జూనియర్ డాక్టర్ల సంఘం అభిప్రాయపడుతున్నాయి. కమిటీ రెండు నెలల్లో సమగ్ర నివేదికను సమర్పించనున్న నేపథ్యంలో, ఆ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం ముందడుగు వేయాలని వైద్య వర్గాలు కోరుతున్నాయి.

# మహిళా సాధికారకతకు విద్య అత్యుత్తమ సాధన



**చల్లపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళల అభివృద్ధి,సాధికారతకు విద్య అత్యుత్తమ సాధనం అని ఎస్సీ,ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. చల్లపల్లి లోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సురేష్ బాబు సందర్శించి విద్యార్థుల చదువు,వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్య యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ వసతి గృహంలో చదువుకోవడం ద్వారా ఇంటి వద్ద పనుల భారం,సామాజిక ఒత్తిళ్ల లాంటి సమస్యలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి కేంద్రీకరించవచ్చని అన్నారు.

బాలికలు చదువుకోవడం ద్వారా సొంత నిర్ణయాలు తీసుకోవడం, జీవనోపాధి పెంపొందించుకొంటూ ఉన్నత స్థానంలో నిలబడే శక్తిని సంపాదించవచ్చన్నారు. చదువు కోసం వెచ్చించే సమయం స్వతంత్రతో ఉన్నత స్థానాలను చేరుకోవడానికి దోహాదపడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులు, ఆలోచనలు కన్నా సాధించాలనే సంకల్పం బలంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఆత్మవిశ్వాసం గల మహిళలుగా సమాజంలో ఎదగాలన్నారు. వసతి గృహంలో తొమ్మిది,పదవ తరగతి విద్యార్థులకు ట్యూటర్ లను నియమించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి షాహిద్ ను కోరినట్లు సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్ల ను అందజేశారు. కార్యక్రమంలో నేతలు మద్దాల వెంకటేశ్వరరావు,హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరి నాగభూషణరావు భవన్‌లో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేసి, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమాన హక్కులు, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు మాట్లాడుతూ, ఆర్టీసీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఇప్పటికీ తక్కువ వేతనాలతోనే విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు సక్రమంగా లేకపోవడం, కాంట్రాక్టర్ల ద్వారా జీతాల చెల్లింపులు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 27న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న 'చలో విజయవాడ' మహాధర్నాకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వారందరికీ భవిష్యత్తులో మరెన్నో ప్రశంసలు దక్కాలి : సిఎం చంద్రబాబు






**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 72 వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను శనివారం సాయంత్రం ప్రకటించిన సంగతి విదితమే. ఈ క్రమంలో 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. అవార్డు గ్రహీతలందరికీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు, మరెన్నో ప్రశంసలు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ బెస్ట్ విషెస్ తెలిపారు. ఆదివారం సోషల్ మీడియా వేదికగా సిఎం చంద్రబాబు స్పందిస్తూ.... సినిమా కీర్తిని మరింత పెంచి, తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఎనలేని గర్వకారణంగా నిలిచిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, చిత్ర బృంద సభ్యులందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. కళ, సంస్కృతి, సినిమా మన గుర్తింపునకు, వారసత్వానికి బలమైన స్తంభాలని చెప్పారు. తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, తన ప్రతిభతో రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

అవార్డు గ్రహీతలందరికీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు, మరెన్నో ప్రశంసలు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ బెస్ట్ విషెస్ తెలిపారు. 72వ జాతీయ చలన చిత్ర పురస్కార విజేతలను సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. నిహారిక కొణిదెల నిర్మించిన కమిటీ కుర్రోళ్లు ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. నేషనల్ ఫిలిమ్స్‌లో 9 అవార్డులతో టాలీవుడ్ సత్తా చూపించడం గర్వంగా ఉందని దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. కథ, నటన, సాంకేతిక నైపుణ్యం, కాస్ట్యూమ్ డిజైనింగ్, మేకప్, నిర్మాణ విలువలు ఇలా అన్ని విభాగాల్లో తెలుగు సినిమా ప్రతిభ చాటిందని కొనియడారు.

# పెండింగ్ ఐఆర్, పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వంతో చర్చలు వేగవంతం చేస్తాం

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని ఐక్యవేదిక నిర్ణయించింది.

ఆదివారం విజయవాడలోని ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో చైర్మన్ కె.ఆర్. సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గత ఎనిమిదేళ్లుగా చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఐఆర్, పీఆర్సీ, డీఏ తదితర అంశాలపై ప్రభుత్వంతో చర్చలను వేగవంతం చేయాలని, పెండింగ్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఐక్యవేదిక జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సమావేశం స్వాగతించింది.

సెప్టెంబర్ 1న ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'సీపీఎస్ బ్లాక్ డే-ఛలో గుంటూరు' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను నాయకులు ఆవిష్కరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం త్వరలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పించి సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు.

సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్, ఆర్థిక కార్యదర్శి ఎం. రమేష్ కుమార్, అడిషనల్ సెక్రటరీ జనరల్ నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాగంటి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నదుల అనుసంధానంపై పార్లమెంట్‌లో చర్చించాలి: లావు శ్రీకృష్ణ దేవరాయలు



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో నదుల అనుసంధానంపై మొదటి నుంచి సీఎం చంద్రబాబు మాట్లాడుతున్నారని తెలుగుదేశం పార్టీ లోక్‌సభా పక్ష నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు వ్యాఖ్యానించారు. ఆదివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్‌లో నదుల అనుసంధానంపై చర్చ జరగాలని సూచించారు. అన్ని పార్టీలు నదుల అనుసంధానంపై చర్చలో పాల్గొనాలని అన్నారు. గోదావరి, పెన్నా నదులను అనుసంధానించాలని తెలిపారు. ఆక్వా రైతుల ఫీడ్ ధరలు తగ్గించాలని చెప్పారు. పడిపోయిన పొగాకు ధరల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పొగాకు రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌పై పార్లమెంట్‌లో చర్చించాలని చెప్పుకొచ్చారు.

**వాటిపై కొత్తగా చట్టాలు తీసుకురావాలి.. :** సోషల్ మీడియాలో వ్యక్తిగత హననంపై పార్లమెంటులో స్వల్ప కాలిక చర్చ జరగాలని లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. రాజకీయ నేతలు, సెలబ్రిటీలే కాకుండా సామాన్య ప్రజలు కూడా వ్యక్తిగత హననానికి గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంపైన కొత్తగా చట్టాలు తీసుకురావాలని సూచించారు. వీటిపైన పార్లమెంట్‌లో చర్చించాలని అన్నారు. మ్యూల్ అకౌంట్స్, ఆన్‌లైన్ మోసాలు, షెల్ కంపెనీలతో ప్రజలు నష్టపోతున్నారని.. దీనిపై చర్చ జరగాలని చెప్పారు. పోలవరం, అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. 2027 మార్చి నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దాని తర్వాత సెకండ్ ఫేస్ పూర్తి చేస్తామని తెలిపారు. ఏపీలో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను రూ.60 వేల కోట్లతో గుర్తించామని చెప్పారు. తదుపరి ఎన్నికలకు వెళ్లే ముందే వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు.

**ఏపీ అభివృద్ధిని వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారు.. :** ఏపీలో ఇరిగేషన్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు పార్లమెంట్ సమావేశాల్లో అంశాలను లేవనెత్తాలని చంద్రబాబు సూచించారని లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉచ్చులో పడి గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారని ప్రస్తావించారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు ఈసారి పాస్ అవుతాయని ఆశిస్తున్నానని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై బురద జల్లుతున్నారని ఆగ్రహించారు. దేశం, రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారని అన్నారు. గుంటూరులో మహిళపై జరిగిన ఘటనను ఖండిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనకు కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు. అమరావతి రాజధానిగా కేంద్రం నోటిఫై చేస్తే. వైసీపీ వ్యతిరేకించిందని లావు శ్రీకృష్ణ దేవరాయలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వేమూరు నియోజకవర్గంలో ఐదుగురికి రూ.7.01 లక్షల సీఎంఆర్ఎఫ్ మంజూరు



**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్) :** వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, అమృతలూరు మండలాలకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్-ఎల్‌వోసీ) కింద మొత్తం రూ. 7,01,432 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)లను ప్రభుత్వం మంజూరు చేసింది. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వైద్య ఖర్చుల కోసం అవసరమైన ఎల్‌వోసీల మంజూరుకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేసిన సిఫార్సుల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయం ప్రతిపాదనలను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందించింది.

కొల్లూరు మండలానికి చెందిన నలుగురికి, అమృతలూరు మండలానికి చెందిన ఒకరికి ఈ సహాయం లభించింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

కాగా, అనంతవరం గ్రామానికి చెందిన బలిజేపల్లి సాంబశివరావుకు రూ. 3,05,054, దొనేపూడికి చెందిన కేసాని విజయలక్ష్మికి రూ. 1 లక్ష, వాగోలు నిరీక్షణ కుమారికి రూ. 1,02,714, చిలుమూరుకు చెందిన గాజుల వెంకటేశ్వర్లుకు రూ. 49,319, అమృతలూరు మండలం ప్యాపర్రుకు చెందిన చిన్నారి షేక్ ఆయిషాకు రూ. 1,44,345 చొప్పున ఎల్‌వోసీలు మంజూరయ్యాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల చొరవతో వైద్య సహాయం అందడంతో లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా పునర్విభజనలో అసలు నియామక తేదీ ఆధారంగా సీనియారిటీ ఇవ్వాలి

○ టీఎన్‌యూఎస్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా పునర్విభజన నేపథ్యంలో ఉపాధ్యాయుల జిల్లా అలాట్‌మెంట్ కోసం రూపొందిస్తున్న జిల్లా సీనియారిటీ జాబితాల్లో ప్రమోషన్ రివర్షన్ తీసుకున్న ఉపాధ్యాయులు, ఎయిడెడ్ విద్యాసంస్థల నుంచి మండల, జిల్లా పరిషత్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో విలీనమైన ఉపాధ్యాయులు, అలాగే అంతర జిల్లా బదిలీల ద్వారా వచ్చిన ఉపాధ్యాయులకు వారి అసలు నియామక తేదీ ఆధారంగా సీనియారిటీ కల్పించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా పునర్విభజన అనేది పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన ప్రక్రియ మాత్రమేనని, దీని వల్ల సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు తమ న్యాయమైన సీనియారిటీని కోల్పోయే పరిస్థితి తలెత్తకూడదని పేర్కొన్నారు.

ప్రస్తుతం రూపొందించిన జిల్లా సీనియారిటీ జాబితాల్లో అసలు నియామక తేదీని పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల పలువురు ఉపాధ్యాయులు జిల్లా అలాట్‌మెంట్‌లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తర్వాత ప్రభుత్వ సేవలో చేరిన ఉపాధ్యాయులు సీనియారిటీలో ముందంజలో ఉండగా, దశాబ్దాలుగా పనిచేస్తున్న వారు వెనుకబడటం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. జిల్లా అలాట్‌మెంట్ కోసం మాత్రమే ప్రమోషన్ రివర్షన్ తీసుకున్న ఉపాధ్యాయులు, ఎయిడెడ్ నుంచి విలీనమైన ఉపాధ్యాయులు, అంతర జిల్లా బదిలీల ద్వారా వచ్చిన వారికి అసలు నియామక తేదీ ఆధారంగా సీనియారిటీ కల్పిస్తూ జిల్లా సీనియారిటీ జాబితాలను సవరించేలా తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్య కమిషనర్‌ను టీఎన్‌యూఎస్ కోరింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467